J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 2 13.06.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

గెలవలేని పోరాటం కోసం

# ఎందుకీ ఆరాటం



- దేశంలో తుది అంకానికి చేరుతున్న నక్సల్స్ ఉద్యమం
- అగ్రనేతలను కోల్పోతున్న మావోయిస్టు పార్టీ
- ఆపరేషన్ ఖగార్ పేరుతో కేంద్ర బలగాల దూకుడు

**భూ**స్వాముల ఆరాచకాలను అంతమొందించేందుకు, బూర్జువాల మదమణిచేందుకు, అదుపుతప్పే పాలకులను గాడినపెట్టేందుకు పురుడుపోసుకున్న విప్లవోద్యమం నేడు క్రమంగా కనుమరుగైపోతోంది. ఒకనాడు కాంతులీనిన ఎర్రజెండ, నేడు నాయకత్వలేమితో కళావిహీనమవుతోంది. ఒకప్పుడు శ్రీకాకుళం నుంచి నేపాల్ వరకూ దేశంలోని సగం రాష్ట్రాల్లోని నాయకులకు, ప్రభుత్వ యంత్రాంగానికి, అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన మావోయిస్టులు, ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌లోని ఒకటి రెండు జిల్లాలకే పరిమితమయ్యే దుస్థితి నెలకొంది.

**ఒ**క్కమాటలో చెప్పాలంటే గూడెం జనాల కోసం, అడవి తల్లి బిడ్డల కోసం, గిరిజనుల శ్రేయస్సు కోసం, అభివృద్ధి, ప్రకృతి వనరుల రక్షణ కోసం దండకారణ్యంలో గర్జించిన తుపాకీ నేడు ఎక్కుపెట్టేవారు లేక నేలకొరుగుతోంది. ఆరు దశాబ్దాల నక్సల్స్ అప్రతిహత పోరాటయాత్ర అంతిమ దశకు చేరి దాదాపుగా తెరమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోంది. 2026 మార్చి నాటికి దేశంలో నక్సల్స్ ఉనికే ఉండదన్న హోంమంత్రి అమిత్ షా మాటను నిలబెట్టేందుకు దండకాణ్యాన్ని జల్లెడ పడుతూ, ఎన్‌కౌంటర్లతో విరుచుకుపడుతూ సీఆర్‌పీఎఫ్, కోబ్రా దళాలు దూసుకెళుతున్నాయి.

2లో



# అమరావతిపై ఆగమాగం!

2లో




కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి
వ్యవస్థాపకులు, 'లాయర్' వార్తాపత్రిక

వార్షికాభినందనలు

లాయర్
44వ
వార్షికోత్సవం

విశ్లేషణాత్మక వార్తల వేదిక
జిల్లా సమగ్ర సమాచార దీపిక
నెల్లూరీయుల ప్రియతమ పత్రిక
లాయర్
44 సంవత్సరాలు పూర్తి చేసుకుని
జూన్ 5, 2025న **45**వ యేట
అడుగిడిన ఆనంద తరుణంలో
**నా హార్ధిక శుభాకాంక్షలు.**



అనపల్లి అశోక్‌కుమార్‌రెడ్డి
కోవూరు

అనపల్లి కన్వెన్షన్ సెంటర్
కోవూరు నేషనల్ హైవే ప్రక్కన, నెల్లూరు.
ఫోన్: 9943902000, 76590 61115.

సీజన్స్ ఇన్
BUDGET HOTEL WITH 3 STAR FACILITIES
పోలీస్ ఆఫీస్ రోడ్డు, దర్గామిట్ట, నెల్లూరు.
ఫోన్. 0861 - 2324001, 2324002.
www.seasonsinn.in

# గెలవలేని పోరాటం కోసం.. ఎందుకీ ఆరాటం

(మొదటిపేజీ తరువాయి)

ఇటీవల మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సహా, కేంద్ర కమిటీ సభ్యులు కూడా హతమవడంతో, మిగిలిన ఆ కొద్దిమంది పరిస్థితి అగమ్యగోచరంగా మారిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

## నాడు ఘనం.. నేడు దీనం...!

1967లో పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్‌బరి అనే గ్రామంలో నక్సలిజం పుట్టుకొచ్చింది. భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా రైతులు, గిరిజనులు ప్రారంభించిన ఉద్యమం క్రమంగా కమ్యూనిస్టు సిద్ధాంతాల ప్రభావంతో సాయుధ పోరాటంగా మారింది. చారుమజుందార్, కనుసన్యాల్ నేతృత్వంలో తర్వాత ఇది మావోయిస్టు కమ్యూనిస్టు గ్రూప్‌గా రూపాంతరం చెందింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో కొండపల్లి సీతారామయ్య పీపుల్స్ వార్ గ్రూప్‌ను ప్రారంభించారు. ఇది బిహార్, జార్ఖండ్‌లోని కమ్యూనిస్టు గ్రూప్ ప్రభావంతో దేశవ్యాప్తంగా విస్తరించింది. ముఖ్యంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర కూడలిలో అత్యంత బలీయంగా మారింది. 2000నాటికి దేశంలో నక్సలైట్ ఉద్యమం పతాకస్థాయిని అందుకుంది. 2004లో పీపుల్స్‌వార్ గ్రూప్, మావోయిస్టు కమ్యూనిస్టు గ్రూప్ కలిసి భారత కమ్యూనిస్టు పార్టీగా మారాయి. ఆ సమయంలో ప్రధాన కార్యదర్శి సహా మావోయిస్టు కేంద్ర కమిటీలో 39 నుంచి 42మంది వరకు సభ్యులుండేవారు. అయితే, 2013లో ఛత్తీస్‌గడ్‌లో కాంగ్రెస్ నేతలను అత్యంత పాశవికంగా మావోయిస్టులు హతమార్చడంతో కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం వారిని ఉక్కుపాదంతో అణిచివేయాలని నిర్ణయించింది. ఇదే మావోయిస్టుల పతనానికి నాందీ ప్రస్తావన చేసిన చర్యగా విప్లవకారులు, విరసం (విప్లవ రచయితల సంఘం) నేతలు చెప్తుంటారు.

## ఆపరేషన్ గ్రీన్‌హంట్‌తో మొదలై, ఖగార్ వరకు!

యూపీఏ ప్రభుత్వ హయాంలో మావోయిస్టుల ఏరివేత కోసం కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ప్రారంభించింది. తర్వాత 2017లో మోదీ ప్రభుత్వం ఆపరేషన్ సమాధాన్‌తో మావోయిస్టు ప్రధాన స్థావరాలపై దాడులు నిర్వహించింది. 2023 చివరి నుంచి ఆపరేషన్ ఖగార్‌తో సీఆర్‌పీఎఫ్ బలగాలు పకడ్బందీగా, అత్యాధునిక ఆయుధాలతో, డ్రోన్ల సహాయంతో కూంబింగ్ నిర్వహిస్తూ షెల్టర్ జోన్లను చుట్టేస్తున్నాయి. దేశంలో అంతర్గతంగా శాంతి భద్రతల సమస్యకు ప్రధాన కారణం నక్సల్ ఉద్యమం అని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీర్మానించింది. దీన్ని అంతమొందిస్తామంటూ శపథం చేస్తోంది. ఇందుకోసం చర్చలా లేక చావులా రెండింటిలో ఏదో ఒక మార్గాన్ని నక్సల్స్ ఎంచుకోవాలని స్పష్టం చేస్తోంది. దీంతో మావోయిస్టులకు దిక్కుతోచని పరిస్థితులు నెలకొన్నాయి.

## చర్చలకు నో చాన్స్..

ఎన్డీయే నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలో నక్సలైట్లందరినీ 2026 మార్చి నాటికి అంతమొందించాలని కంకణం కట్టుకుంది. ఇందుకోసం మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల్లో అత్యంత తీవ్రంగా మావోయిస్టుల ఏరివేసే కార్యక్రమం చేపడుతోంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బిహార్, జార్ఖండ్, వెస్ట్‌బెంగాల్‌లో మావోయిస్టుల ఉనికే లేకుండా పోయింది. ఒక్క ఛత్తీస్‌గడ్‌లోని బస్తార్, సుక్మా జిల్లాల పరిధిలోని దండకారణ్యం, కర్రెగుట్టల్లో మాత్రమే మావోయిస్టులు ప్రస్తుతం తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. దీంతో కేంద్రం వీలైనంత తొందరగా ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవాలని తహతహలాడుతోంది. ఈ క్రమంలో చర్చలకి అవకాశం కూడా ఇవ్వడం లేదు. చర్చలకి తాము సిద్ధంగా ఉన్నామని కొన్ని గ్రూపులు ప్రకటించినా, కేంద్రం ఆ ప్రతిపాదనని తమ చెవికెక్కించుకోలేదు.

## వరుస ఎన్‌కౌంటర్లతో కుదేలవుతున్న కేడర్

గత ఏడాదిన్నర కాలంగా ఆపరేషన్ ఖగార్‌లో భాగంగా సీఆర్‌పీఎఫ్ జవాన్లు భారీస్థాయిలో సర్చ్ ఆపరేషన్లు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో తమకు ఎదురవుతున్న నక్సలైట్లను ఎన్‌కౌంటర్ల పేరుతో తుదముట్టిస్తున్నారు. నెలక్రితం అబుజ్‌మడ్ అడవుల్లో చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్, ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావ్ మృతి చెందారు. ఈయన ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా టెక్కలి వాసి కావడం గమనార్హం. 1980 దశకంలో వరంగల్ ఆర్‌ఈసీలో ఎంటెక్ కూడా చదివారు. ఏకంగా పెద్దతలే పోవడంతో మావోయిస్టులకు ఇది కోలుకోలేని దెబ్బగా విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. ఇక ఈ ఎన్‌కౌంటర్ దేశంలోని భద్రతా దళాలకు గొప్ప విజయమని ఏకంగా ప్రధాని మోదీ కూడా కొనియాడారు. త్వరలోనే నక్సల్ రహిత భారత్‌ను చూడబోతున్నామంటూ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అయితే సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై ప్రశంసల వర్షం కురిపించారు. 2025లో ఇప్పటివరకు దాదాపు 500 మందికి పైగా నక్సల్స్ ప్రాణాలు కోల్పోయారని ప్రకటించారు. దేశంలో యాక్టివ్‌గా ఉన్న సాయుధ మావోయిస్టులు 1000 మాత్రమే అని అంచనా వేశారు. వారంతా లొంగిపోవాలని, లేకుంటే ఎన్‌కౌంటర్లలో హతమవడం తప్పదని హెచ్చరించారు. ఇక తాజాగా కేంద్ర కమిటీ సభ్యుడైన కామ్రేడ్ సుధాకర్ 40 ఏళ్ల పాటూ ఉద్యమబాటలో నడిచి ఎన్‌కౌంటర్‌లో హతమవడం నక్సల్స్‌కు భారీ ఎదురుదెబ్బే. ఈయన 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న తరుణంలో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం నిర్వహించిన శాంతి చర్చల్లో ప్రధానంగా పాల్గొన్నారు. ఈయన ఆయుర్వేద వైద్య విద్యను అభ్యసిస్తూ 1985లో మావోయిస్టు ఉద్యమానికి ఆకర్షితులై అహరహం పోరాడుతూ చివరికి అడవిలోనే నేలకొరగడం గమనార్హం.

## అన్నలను ఆదుకునేవారేరీ..?

'కర్ణుడి చావుకు కారణాలు అనేకం' అన్నట్లుగా నక్సలైట్ ఉద్యమం పట్టుకోల్పోవడానికి చాలా అంశాలే దోహదకారిగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల అడవుల నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, జార్ఖండ్, బిహార్, పశ్చిమబెంగాల్ వరకు దుర్భేద్యమైన అటవీ ప్రాంతం మావోయిస్టులకు రక్షణ కల్పించేది. అయితే, భారీగా రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం, గనుల తవ్వకం కోసం ప్రభుత్వం అటవీ ప్రాంతాన్ని తొలగించడంతో అడవుల్లో వివిధ ప్రాంతాలకు చేరుకోవడం సులువుగా మారింది. వీటికి తోడు కేంద్రంలోని యూపీఏ, ఎన్డీయే ప్రభుత్వాలు మావోయిస్టుల ఏరివేతకు కోబ్రాతో పాటు స్పెషల్ ఫోర్స్‌ను ప్రత్యేకంగా దించడంతో మావోయిస్టులకు రక్షణ దుర్లభంగా మారింది. ఇక మావోయిస్టు పార్టీ కూడా తమతో చర్చలు జరపాలని ఎన్నిసార్లు లేఖలు రాసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గతంలో ఎన్‌కౌంటర్లు జరిగితే విరసం రచయితలతో సహా పౌర హక్కుల సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు ప్రభుత్వ తీరును ఎండగట్టేవి. అయితే, ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. పైగా ఉద్యమ మార్గం వైపు ప్రస్తుత యువత మొగ్గుచూపడం తక్కువే. ఎందుకంటే గతంలోలాగా భూస్వాములు, బూర్జువాలు ఇప్పుడు లేరు. పైగా అడవిలో ఉంటూ సమ సమాజస్థాపన చేస్తామనడం అర్థంలేని వాదంగా నేటి యువత భావిస్తోంది. దీంతో మావోయిస్టులకు అన్ని దారులూ మూసుకుపోతున్నాయి. ముఖ్యంగా ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో మిలిటరీ ఎక్స్‌పర్ట్‌గా గుర్తింపు పొందిన హిడ్మాను అంతమొందిస్తే నక్సల్స్ ఉద్యమం చరిత్రలో కలిసిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ పరిస్థితులలో నక్సల్ అగ్రనేతలు, ప్రభుత్వం రెండు సమన్వయంతో చర్చించి ప్రాణనష్టం లేకుండా సమస్య పరిష్కారించుకొంటే మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఓడిపోయే పోరాటం కోసం ఇంతటి ఆరాటం అవసరమా అన్న అభిప్రాయం మేధావుల నుండి వ్యక్తమవుతోంది!

---

# గురుకులాల సమన్వయకర్తగా.. ప్రభావతమ్మ



జిల్లాలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయకర్తగా డా.సి ప్రభావతమ్మ నియమితులయ్యారు. ఈనెల 11న ఆమె నెల్లూరులోని పాత జుబ్లీ ఆసుపత్రి ఆవరణంలో ఉన్న విద్యాలయాల జిల్లా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని గురుకులాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు, మౌలిక సదుపాయాలన్నీ కల్పించేందుకు కృషిచేస్తానన్నారు.

# కావలి సహకారశాఖ అధికారిగా.. రాజశేఖర్



నెల్లూరు జిల్లా కావలి డివిజన్ సహకారశాఖ అధికారిగా పి.రాజశేఖర్ ఈనెల 11న బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లాలో డిప్యూటి రిజిస్ట్రార్‌గా ఉన్న ఆయన, ఇటీవలే కావలికి బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం, జిల్లా సహకారశాఖ అధికారి గురప్పను ఆయన గౌరవపూర్వకంగా కలుసుకున్నారు.

# అమరావతిపై ఆగమాగం!

ఏ లగ్నాన రాష్ట్ర విభజనకు బీజాలు పడ్డాయో కానీ, అప్పటి నుంచి ఆంధ్రులకు రాజధాని అనేది ఓ అంతుచిక్కని మిస్టరీగా మారిపోయింది. తొలుత చంద్రబాబు గుంటూరు – విజయవాడ మధ్యన అమరావతిని రాజధానిని ఎంపిక చేసి ప్రకటిస్తే, ఆ తర్వాత వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి దాన్ని అటకెక్కించారు. అమరావతిని అభివృద్ధి చేయకపోగా, మూడు రాజధానులంటూ మూడుముక్కలాట ఆడారు. పైగా తమ నాయకులతో అమరావతిపై ఇష్టారాజ్యంగా మాట్లాడించి తన ఇగోను చల్లార్చుకున్నారు. ఈ క్రమంలో భూములిచ్చిన రైతులు అనాథలయ్యారు. ఎన్నో ఆశలతో అక్కడి ప్రజలు కట్టుకున్న కలల సౌధాలు కల్లలుగానే మిగిలిపోయాయి. కొందరు అమరావతిని కమ్మరావతి అంటే, మరికొందరు భ్రమరావతి అంటూ ఎగతాళి చేశారు. ఇంకొందరు శ్మశానం అంటూ ఎద్దేవా చేశారు. ఐదేళ్ళ తర్వాత మూడు రాజధానుల ఫార్ములా ఫెయిల్ అయ్యింది. జగన్ పార్టీ 11 సీట్లకే పరిమితమైంది. 164 సీట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఫస్ట్ ప్రయారిటీగా అమరావతిని ఎంచుకుంది. ఈ క్రమంలోనే ప్రధాని మోదీని పిలిచి ఘనంగా పునః ప్రారంభం కూడా చేసింది. అయితే షరామామూలే అన్నట్లు వైఎస్‌ఆర్‌సీపీ తన వక్రబుద్ధిని మరోసారి చాటుకుంది. అవకాశం దొరికినప్పుడల్లా అమరావతిపై బురద చల్లుతూ ఆగమాగం చేస్తోంది.

## అసంబద్ధ మాటలతో స్థాయి దిగజారి!

ఈ క్రమంలో సాక్షి టీవీ ఛానెల్‌లో ప్రసారమయ్యే కేఎస్‌ఆర్ లైవ్‌షో అనే కార్యక్రమంలో కృష్ణంరాజు అనే ఓ విశ్లేషక ఘనుడి భుజంపై తుపాకీ పెట్టి వైసీపీ మాటల తూటాలు పేల్చింది. ఓ ఆంగ్ల పత్రికలో వెలువడిన సర్వేని ఉటంకిస్తూ జుగుప్సాకర రీతిలో కృష్ణంరాజు తన నోటిదూలని తీర్చుకునేలా ఆయనని ఉసికొల్పింది. దీంతో ఆయన రెచ్చిపోయాడు. భారతదేశంలో వ్యభిచార గృహాలు, సెక్స్‌వర్కర్లు, ఎయిడ్స్ సంక్రమించే అవకాశం ఉన్న హాట్‌స్పాట్ ప్రాంతాలు అమరావతికి చుట్టుపక్కల ఉన్నాయంటూ ఆయన నోరుపారేసుకున్నారు. ఉచ్చం నీచం మరిచి, చంద్రబాబు, పవన్ కల్యాణ్ అమరావతిని దేవతల రాజధాని అంటున్నారని, నిజానికి అది వేశ్యల రాజధాని అని సదరు లైవ్‌షోలో నొక్కి వక్కాణించారు. ఇదే విషయాన్ని ఓ ఆంగ్లమీడియా పేర్కొందని ఉదహరించారు. దీంతో రాజధాని ప్రాంత రైతులు, మహిళలతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంత మహిళలు కూడా పెద్దఎత్తున ఉద్యమబాట పట్టారు. అమరావతిపై విద్వేషంతోనే సాక్షి ఛానెల్‌లో ఇలాంటి వ్యాఖ్యలు చేయించారని మండిపడ్డారు. జర్నలిస్ట్ కొమ్మినేనితో పాటు కృష్ణంరాజు దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. వారి ఫొటోలను చెప్పులతో కొడుతూ నిరసన వ్యక్తం చేశారు. వీరికి తెలుగుదేశం నాయకులు కూడా తోడు కావడంతో ధర్నాలతో ఆయా జిల్లా కేంద్రాలు దద్దరిల్లాయి. జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతి బేషరతుగా క్షమాపణ చెప్పాలంటూ నినదించారు. సాక్షి కార్యాలయాల ముందు ఆందోళనలు చేపట్టారు.

## సెగని పెంచిన సజ్జల...

ఇక గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సకలశాఖా మంత్రిగా అడ్డగోలుగా వ్యవహరించి, అన్ని వ్యవస్థలనూ భ్రష్టు పట్టించిన సజ్జల రామకృష్ణారెడ్డి వైఖరి చూస్తుంటే ఆ పార్టీ మరింతగా పతనం కావడానికి ఆయన కంకణం కట్టుకున్నట్లుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమరావతి వేశ్యల రాజధాని అంటూ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యల దుమారం అంతకంతకూ పెరుగుతుండగానే, అగ్నికి ఆజ్యం పోసినట్లు ఆందోళన చేస్తున్న వారిని పిశాచాలు, రాక్షసులు లేదా అవి రెండూ కలిసి ఏర్పడిన సంకర తెగ అంటూ సజ్జల వ్యాఖ్యానించడం ఆయన అవివేకానికి, అహంకారానికి అద్దం పడుతూ విశ్లేషకుల అభిప్రాయానికి బలం చేకూరుస్తున్నాయి. సజ్జల వ్యాఖ్యల ఫలితంగా నిరసనలు, ధర్నాలు మరింత పెరిగాయి. శాపనార్థాలు ఎక్కువయ్యాయి. అలాగే రాష్ట్ర, జాతీయ మహిళా కమిషన్లు సైతం ఈ అంశంపై దృష్టి సారించాయి. రాష్ట్ర డీజీపీకి ఇప్పటికే జాతీయ మహిళా కమిషన్ అమరావతి వేశ్యల రాజధాని అంటూ సాక్షి డిబేట్‌లో ప్రసారం కావడంపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టాలని, మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని కోరిన విషయం తెలిసిందే. ఇక సజ్జల వ్యాఖ్యలపై కూడా కూపీలాగినట్లు తెలుస్తోంది. దీంతో సజ్జలకూ శ్రీకృష్ణ జన్మస్థానం తప్పేలా లేదనే ప్రచారం జోరందుకుంది.

## దండన విధించాల్సిందే..

సభ్యసమాజం తల దించుకునేలా నీచపు వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజును 11వతేదీ బుధవారం అరెస్టు చేయగా, ఆ మాటలను ఖండించని కొమ్మినేని శ్రీనివాస్‌రావును ఇప్పటికే అరెస్టు చేసి 14 రోజుల రిమాండుకి పంపారు. ఇలాంటి వ్యాఖ్యలతో జర్నలిజం విలువలు పాతాళానికి పడిపోతున్నాయని మేధావి వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అమరావతి కోసం భూములిచ్చిన మహిళల గురించి కొందరు నోరుపారేసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తూ భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఎక్స్ వేదికగా స్పందించారు. ఇలాంటి జుగుప్సాకరమైన వ్యాఖ్యలు అత్యంత దారుణమైనవి, హేయమైనవి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరందరిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని వెంకయ్య అభిప్రాయపడ్డారు. ఇక ఇదే ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ వైఎస్సార్సీపీ నాయకులు, సాక్షి మీడియాపై దుమ్మెత్తిపోశారు. జగన్, భారతీరెడ్డి ఈ విషయంపై మౌనం వీడాలని డిమాండ్ చేశారు. ఇక పాత్రికేయులు, విశ్లేషకులు సైతం కృష్ణంరాజు, కొమ్మినేని వ్యాఖ్యలు జర్నలిజానికి సిగ్గుచేటంటూ ఏకిపారేశారు. ఇప్పటికైనా కుహనా రాజకీయాలకి కొమ్ముకాసే జర్నలిస్టులు, సానుభూతిపరులు నైతిక విలువలకు కట్టుబడాలని హితబోధ చేశారు. ఏదేమైనా రాష్ట్రంలో ఇటు రాజకీయం, అటు మీడియా రెండూ వర్గ పోరాటాలను తలపించేలా సిగపట్లకు దిగడం ఏమాత్రం హర్షణీయం కాదన్న మాట సర్వత్రా వినిపిస్తోంది..!

# ఏడాది పాలనలో... వేగంగా అభివృద్ధి!

## కొనియాడిన నెల్లూరు నేతలు



కూటమి ప్రభుత్వం ఏర్పడి, రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు వచ్చాక రాష్ట్రంలో ఈ ఏడాది పాలనలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయని నెల్లూరు నాయకులు కొనియాడారు. ఈనెల 12వ తేదీ గురువారం విజయోత్సవ వేడుకలు జరిగాయి. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.. ఆయన సోదరుడు.. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విశిష్టఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, గత వైకాపా విధానాలతో రాష్ట్రం అస్తవ్యస్తమైందని, చంద్రబాబునాయుడు తన అపార పాలనానుభవంతో రాష్ట్రాన్ని ప్రగతిపథం వైపుకు తీసుకువెళ్తున్నారని అన్నారు. అమరావతిని రాష్ట్రానికి అద్భుత రాజధానిగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు రూరల్‌లో జరుగుతున్న కార్యక్రమాలను అభినందించారు. ప్రజాహిత కార్యక్రమాల నిర్వహణ ఎలా చేయాలి... అనేది కోటంరెడ్డి సోదరుల నుండి మనం నేర్చుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో గుంతలమయమైవున్న రోడ్ల స్థితి గతులు మార్చివేసిందన్నారు. అభివృద్ధి-సంక్షేమం రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు మేలు కలిగేవిధంగా అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రవేశపెడుతుండడం హర్షదాయకమన్నారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి ఇద్దరూ కలిసి చేపట్టిన అభివృద్ధి పనులు బాగున్నాయని ఆయన అభినందించారు. నిత్యం ప్రజల్లో ఉండే నేత శ్రీధర్‌రెడ్డి అని ప్రశంసించారు. ఈ వేడుకల్లో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు, కో-క్లస్టర్ ఇన్‌చార్జులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధసంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# లక్నోలో.. మంత్రి నారాయణ

## వ్యర్థాల నిర్వహణ అంశాల పరిశీలన




రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఇటీవలఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో పర్యటించి, అక్కడ ఘన వ్యర్థాల నిర్వహణపై పలు అంశాలను తెలుసుకున్నారు. మంత్రి నారాయణ బృందానికి లక్నో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సుష్మా ఖరాక్వాల్, కమిషనర్ గౌరవ్‌కుమార్ సాదర స్వాగతం పలికి, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కార్పొరేషన్‌లోని ప్రగతి పనులను వివరించారు. ఈ పర్యటనలో మంత్రితో పాటు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్, గ్రీనింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు, మంగళగిరి – తాడేపల్లి కార్పొరేషన్ కమిషనర్ అలీమ్ బాషా తదితరులున్నారు. ఈ సందర్భంగా లక్నోలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ విషయాలను ఆయన తన బృందసభ్యులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్‌ను డంపింగ్ యార్డ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న కృషిలో భాగంగా మంత్రి ఈ యాత్రలో పాల్గొన్నారు. ఇతర రాష్ట్రాలలో వ్యర్థాల నిర్వహణను ఏవిధంగా చేస్తున్నారో అధ్యయనం చేశారు. అదేవిధంగా పూనే సమీపంలో ఉన్న పింప్రి చించివాడ్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వేస్ట్ టు ఎనర్జీప్లాంట్‌ను పరిశీలించారు.

# ఇంటింటికీ.. 'సోమిరెడ్డి కుటుంబం'

## ప్రజల నుంచి మంచి స్పందన



మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ నాయకుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కుటుంబసభ్యులు సర్వేపల్లి నియోజకవర్గంలోని పలు మండలాల్లో పర్యటిస్తూ, ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తున్నారు. దీంతో వారు చేపట్టిన 'ఇంటింటికీ సోమిరెడ్డి కుటుంబం' కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ఇందులో భాగంగా, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కుమారుడు.. సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శృతిరెడ్డి ఇటీవల పొదలకూరు మండలం అమ్మవారిపాళెంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలపై ఆరా తీశారు. ప్రతి ఇంట్లో ప్రజల బాగోగులు ఎలా ఉన్నాయో వారిని అడిగి తెలుసుకున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను వారు వివరిస్తున్నారు. 'తల్లికి వందనం', అన్నదాత సుఖీభవ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి సదుపాయాలను కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి నాయకత్వంలో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వారు హామీ ఇస్తున్నారు.

# జులై 6 నుంచి.. రొట్టెల పండుగ



నెల్లూరులోని ప్రసిద్ధ దర్గా..బారాషహీద్ దర్గాలో జులై 6వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా రొట్టెల పండుగ వేడుకలు జరుగనున్నాయి. మత సామరస్యానికి ప్రతీకగా ఉన్న ఈ దర్గాలో ఏటా లక్షలాది మంది భక్తుల సమక్షంలో జరుగుతున్న ఈ వేడుకలను ప్రభుత్వం గుర్తించి 'రాష్ట్రపండుగగా' కూడా ప్రకటించిన విషయం తెలిసిందే. అయిదు రోజుల పాటు ఈ వేడుకలు జరుగనున్నాయి. రొట్టెల పండుగ రోజుల్లో దేశం నలుమూలల నుంచే కాక, ప్రపంచవ్యాప్తంగా భక్తులు వెల్లువలా తరలి వస్తుండడంతో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తున్నారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేయర్ స్రవంతి, కార్పొరేషన్ కమిషనర్ నందన్ మరియు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు ఈనెల 11న సమావేశమై, రొట్టెల పండుగ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. వేలసంఖ్యలో వచ్చే వాహనాలకు పార్కింగ్, భక్తులకు తాగునీరు, ఆహారం, వసతి, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలు వంటి వాటిలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని వారు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డా. పొంగూరు నారాయణతో కలసి మళ్ళీ ఈ ఏర్పాట్ల విషయాన్ని చర్చించి మరింత మెరుగైన చర్యలు తీసుకుంటామన్నారు. బారాషహీద్ దర్గా నిర్వాహకులు, ముస్లిం మతపెద్దల సహాయ సహకారాలతో రొట్టెలపండుగను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధికారులకు చెప్పారు.

# దేశానికి వెన్నెముక రైతన్నే!

## ఎడ్లబండిపై ఎక్కి.. ఏరువాక ప్రారంభించిన ప్రశాంతమ్మ



దేశానికి వెన్నెముక రైతన్నేనని, నాగరికత ఎంత పెరిగినా... నాగలి లేనిదే పని జరగదని, రైతు లేనిదే ఎవరికీ పూట గడవదని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. విడవలూరు మండలం చౌకచర్ల గ్రామంలో ఇటీవల నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న ప్రశాంతమ్మకు నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. ఎడ్ల బండిపై ఊరేగించుకుంటూ గ్రామానికి తీసుకువచ్చారు. అనంతరం వ్యవసాయ పనిముట్లకు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎడ్ల బండిపై ఎక్కి ఏరువాక ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ... వ్యవసాయానికి సంబంధించిన పండుగ ఏరువాక పౌర్ణమి అని, డెల్టా ప్రాంతమైన కోవూరులో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఉందన్నారు. సాగునీరు రైతులకు పుష్కలంగా ఉందని, ఈ ఏడు పంటలు బాగా పండాలని ఆమె ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తున్నారని, వ్యవసాయం, మత్స్యకార రంగం, రవాణా రంగాల్లో అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోవూరు నియోజకవర్గంలోని అనేక పంట కాలువల్లో పూడికలు తొలగించి రైతులకు మేలు చేశామన్నారు. అంతేకాదు, రైతులకు ఎక్కడ ఇబ్బందులు తలెత్తినా మంత్రుల దగ్గరి నుంచి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ స్పందిస్తున్నారని, ఈ సందర్భంగా ఆమె వారికి తన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

లాయర్
జూన్ 13, 2025

# 'మలిసంధ్య'లో.. నలిగిపోతున్న పండుటాకులు!

వయసు భారమై, పిల్లల అభిమానానికి దూరమై ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది వయోవృద్ధులు ఎన్నో బాధలు పడుతున్నారు. తమ అవస్థలు చెప్పలేక, వాటిని భరించలేక మలి సంధ్యలో తమ జీవితాలను అత్యంత దయనీయంగా గడుపుతున్నారు. అమ్మా-నాన్నలుగా తమ బాధ్యతలను నెరవేరుస్తూ పిల్లలను ఎంతో గారాబంగా పెంచి, వ్యయప్రయాసలు భరించి వారిని పెద్దచేసినా, తమ సుఖశాంతులను త్యాగం చేసి వారి భవిష్యత్తును గొప్పగా తీర్చిదిద్దినా, చివరికి ముసలి వారైన తల్లితండ్రుల పట్ల ఆ పిల్లలు ప్రేమగా లేకుంటే, పండుటాకులైన ఆ తల్లితండ్రులు పడే వేదన ఎంత వేదనా భరితంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. జీవితమంతా కష్టపడినా, జీవిత చరమాంకంలో కూడా అవస్థలే ఎదురైతే ఎలా?..అసలే, వయోభారంతో సరిగా కదలలేక, మెదలలేక, అన్నం కూడా సరిగా తినలేక, మందులు మాత్రలు వేసుకోలేక ఎందరో వృద్ధులు మలిసంధ్యలో తమ జీవితాలను జీవచ్ఛవాలుగానే సాగిస్తున్నారు. వృద్ధాప్యం ఒక శాపంగా మారి వారి జీవితాలను నరకప్రాయం చేస్తోంది. కని-పెంచే తల్లితండ్రులపై కనికరం లేని పిల్లలతో మరెందరో తల్లితండ్రులు తమ బిడ్డల ప్రేమాభిమానాలకు నోచుకోలేకపోతున్నారు. ముసలి వారయ్యాక వారు కోరుకునేదేమీ ఉండదు.. కన్నబిడ్డల నుంచి ప్రేమ తప్ప. కానీ, ప్రేమాభిమానాల సంగతి అటుంచితే, పెద్దవారైన తమ తల్లితండ్రుల పట్ల రకరకాల కారణాలతో వేధింపులకు, దాడులకు పాల్పడే దౌర్భాగ్యపు బిడ్డలు కూడా ఉంటున్నారంటే అతిశయోక్తి కాదు. ప్రపంచవ్యాప్తంగా ఈ దుస్థితి ఉంది. ఒక్క మనదేశంలోనే దాదాపు 60 శాతం మంది వృద్ధులు అలాంటి అఘాయిత్యాలకు గురవుతున్నారని నిపుణుల అంచనా. దీన్నిబట్టి చూస్తే వృద్ధుల పట్ల కనీసం మానవత్వం కూడా లేకుండా ప్రవర్తిస్తున్న వారెందరో లెక్కే లేదు. కొందరు ఆస్తి కోసం తల్లితండ్రులను వేధిస్తే, మరికొందరు ఆ ముసలివారు అనారోగ్యంతో ఉండడంతో వారిని చూడలేక హింసపెడుతున్నారు. కొందరు అనాథాశ్రమాల్లో వదిలేస్తుంటే, మరికొందరు ఊరుకాని ఊర్లలో రోడ్లమీదనే అనాథల్లా వదిలేసి వెళ్లిపోతున్నారు. జన్మనిచ్చిన తల్లిని, చిన్నప్పుడు గుండెల మీద తన్నుతున్నా ఆనందంగా భరించే నాన్నని..ఇంతకాలం కంటికి రెప్పలా తమను పెంచిన కన్నవారిని.. ఇంత నిర్దయగా వదిలేసి వెళ్లిపోతుండడం ఎంత దారుణం?.. ఎన్ని అగచాట్లు పడుతున్నా, శరీరం సహకరించక, చూసేందుకు కళ్ళు సరిగా కనిపించక, ఏం తినాలన్నా పంటి నొప్పులతో తినలేక లోపలెంత మధనపడుతున్నా.. వాటిని బయటకి తెలియనివ్వకుండా మౌనంగానే భరాయిస్తున్నారు. ఆగని దుఃఖాన్ని, కన్నీటిని ఎవరికీ కనిపించనీయకుండా వయోవృద్ధులు పడుతున్న వేదనారోదనలు ఎన్నని చెప్పగలం?.. ఒంటరితనం.. తెలియని భయం...నాలుగ్గోడల మధ్యనే నలిగిపోతున్న జీవితం!..వయోవృద్ధుల మానసిక వేదనని మాటల్లో వర్ణించలేం. అయినా, తమ బిడ్డల కాఠిన్యం గురించి నిందించకుండా..ఎవరికీ ఒక్కమాట కూడా చెప్పకుండా ఆ తల్లితండ్రులు ఆ పరిస్థితుల్లో కూడా బిడ్డల క్షేమాన్నే కోరుకుంటూ ఉంటారు. అది తల్లితండ్రుల సహజ లక్షణం. వారి ప్రేమకి విలువ కట్టలేం. అయితే, రోజురోజుకీ వయోవృద్ధుల పట్ల పెరిగిపోతున్న దాడులు..అమానవీయ పరిస్థితులు మానవతావాదులను కలచివేస్తున్నాయి. వాస్తవానికి అందరూ అంత కఠినాత్ములే ఉండరు.. తల్లితండ్రులను ఎంతో అప్యాయంగా.. ఎలాంటి లోటు రాకుండా కంటికి రెప్పలా చూసుకునేవారు ఎందరో ఉన్నారు. మనదేశంలో సీనియర్ సిటిజన్లకు చట్టపరమైన హక్కులున్నా, ఎంతమంది పెద్దలను గౌరవిస్తున్నారు? అందుకే, ఐక్యరాజ్య సమితి ఈ దుస్థితుల్లో మార్పు తేవాలని జూన్ 15వ తేదీని..'ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినం'గా ప్రకటించింది. వయోవృద్ధుల పట్ల అందరూ ప్రేమగా ఉండాలని, వారిని గౌరవించుకోవడం మన బాధ్యత అంటూ స్పష్టం చేసింది. ఏ తల్లితండ్రులైనా..తమ బిడ్డలు చివరి దశలోనైనా తమను వదిలిపెట్టకుండా తమతోనే ఉండాలని, వాళ్లని చూసుకుంటూనే తాము కనుమూయాలని కోరుకుంటూ ఉంటారు. వారి చివరి కోరికలు కూడా అవే. కానీ అత్యధికశాతం మంది వృద్ధులకు అది కూడా నెరవేరడం లేదు. నేటి బిడ్డలే.. రేపటికి వృద్ధులవుతారని, తాము కూడా ఒకనాటికి వయోవృద్ధులమవుతామని, అప్పుడు తమ పరిస్థితేమిటని ఒక్కసారి ఆలోచించుకోగలిగితే.. ఏ కొందరిలోనైనా.. కొంతలో కొంతైనా మార్పు వస్తే.. అంతకన్నా కావాల్సింది ఏముంటుంది?..

- (జూన్15..ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినం)

# సత్యపీఠం

నిజాలే మాట్లాడుకుందాం! 94

## రియల్ లైఫ్‌ని మింగేస్తున్న 'రీల్స్'..!

ఏ కాలానికి ఆ పిచ్చి అన్నట్లుగా ఉంటోందిప్పుడు సమాజం. ఎవరి ప్రపంచం వారిది. చిన్నవాళ్ళైనా, పెద్దవాళ్ళైనా, ఎవరినీ ఏమీ అనేలా లేవు నేటి పరిస్థితులు. ఆ దారి మంచిది కాదు, అటు వెళ్ళొద్దు అని చెప్పినా, ఎందుకు మంచిదికాదో చూద్దాం అంటోంది నేటి యువత. మూర్ఖంగా అదే దారిన వెళ్ళి ప్రమాదాలు కొని తెచ్చుకుంటోంది. ప్రాణాలమీదకి తెచ్చుకుని పచ్చని జీవితాలని బుగ్గిపాలు చేసుకుంటోంది. నేటి ఆధునిక కాలంలో మాయాదర్పణం రూపంలో సెల్‌ఫోన్ మనిషి అరచేతిలోకి వచ్చేసింది. భూలోకం కాస్తా 'మాయాలోకం'గా మారిపోయింది. చిన్నపిల్లల దగ్గర నుండి పండు ముసలివాళ్ళ వరకూ, సమాజం మొత్తం సెల్‌ఫోన్‌కి దాసోహం అయిపోయింది. నిద్రమంచం దిగిన దగ్గరనుంచి చేతిలో ఫోన్ లేకపోతే, అర క్షణం కూడా గడవని విధంగా పరిస్థితులు ఏర్పడిపోయాయి.

### రియల్ జీవితంపై 'రీల్స్' ప్రభావం..!

ముఖ్యంగా 'రీల్స్' రూపంలో తమ విన్యాసాలని ప్రదర్శించే సంస్కృతి బాగా పెరిగిపోయింది. 'రీల్స్' ఇప్పుడో పెద్ద ఫ్యాషన్‌గా మారిపోయింది. చాలామందికి 'రీల్స్' ఇప్పుడు తమ జీవితంలో ఓ భాగమైపోయింది.

ఇందులో కూడా మంచి-చెడు రెండూ ఉన్నాయి. కానీ, అత్యధికశాతం మంది రెండోదాన్నే ఎంపిక చేసుకుంటున్నారు. ముందుగా దానినే 'లైక్' చేస్తున్నారు. సెల్‌ఫోన్‌లో ఎవరినో చూసి సంతోషపడే రోజుల నుంచి, ఆ చూసేదేదో మనల్నే అందరూ చూస్తే బాగుంటుంది కదా!.. అని తహతహలాడేవారు ఇప్పుడు ఎక్కువైపోయారు. అందుకే, రీల్స్ తీయడం, సోషల్ మీడియాలో పెట్టడం వంటివన్నీ ఇప్పుడు సర్వసాధారణమైన విషయాలైపోయాయి. ఇందులో ఎలాంటి నియంత్రణలు లేకపోవడంతో, వ్యూస్ కోసం కొందరు లేనిపోని పిచ్చివేషాలన్నీ వేస్తున్నారు. ఇళ్ళల్లో తమ పెద్దవాళ్ళ మాటలను కూడా ఖాతరు చేయకుండా, లోగుట్టులన్నీ బయటపెట్టి, ఇంటిగుట్టును రచ్చకీడ్చి కుటుంబ పరువును కూడా బజారులో పెడుతున్నారు. సమాజానికి పనికొచ్చేది అందులో ఏ ఒక్కటీ లేకపోయినా, నిస్సిగ్గుగా తాము చేస్తున్న ప్రదర్శనలనే చాలా గొప్పగా చెప్పుకుంటున్నారు. ప్రారంభంలో సరదాగా ఉన్న ఈ 'రీల్స్' వ్యవహారం ఇప్పుడు మొత్తం ప్రపంచమంతా వేలం వెర్రిగా తయారైపోయింది. వాటిని వీక్షించే జనాలకి కూడా 'రీల్స్' పిచ్చి బాగా అంటుకుంది. వాటిని చూడకుండా ఉండలేకపోతున్నారు. అసలు, 'రీల్స్' చూడందే నిద్రపోని వారు, నిద్ర రాని వారి సంఖ్య ప్రపంచవ్యాప్తంగా కోట్లల్లోనే ఉంటుందన్నా అతిశయోక్తి కాదు.

### అర్ధ నగ్న విన్యాసాలు, అంగాంగ ప్రదర్శనలు..

రీల్స్ మామూలుగా ఉంటే ఎవరు చూస్తారు. ఆకట్టుకునే విధంగా ఉండాలి, అందులో ఏదో ఒక విశేషం ఉండాలి. ఇలా అనుకునే అనేకమంది యువతీయువకులు పోటీలు పడి మరీ చెత్తచెత్త, వీడియోలు తీసి 'రీల్స్' రూపంలో పెడుతున్నారు. పెద్ద చదువులు చదువుకున్నవారు, కొంతమంది గొప్పింటి యువతులు కూడా ఈ రీల్స్‌లోకి వచ్చి తమ ప్రత్యేకతలు చూపుతున్నారు. వయ్యారాలు వొలకబోస్తూ, వొంపుసొంపులను చూపించు కుంటూ అంగాంగ ప్రదర్శనలు కూడా చేస్తున్నారు. కొందరైతే పరమ నికృష్టంగా ఉండేలా రోత పుట్టించే బూతు మాటలు, అత్యంత జుగుప్సాకరమైన అశ్లీలాన్నంతా రాశులుగా పోస్తున్నారు. చూడగూడనివీ, చూపించగూడనివీ అన్నీ కుప్పలుతెప్పలుగా చూపించేస్తున్నారు. 'కనుల తీరా చూస్కోండి' అన్నట్లు నిస్సిగ్గుగా చిత్రీకరించి 'రీల్స్' రూపంలో పోస్టు చేస్తున్నారు. విద్యార్థులు, అధిక శాతం యువత వాటికి అంటుకుపోతున్నారు. వాటిని పిల్లలు చూస్తున్నారా?..పెద్దలు చూస్తున్నారా?.. వారేమనుకుంటారన్న విషయాలను 'రీల్స్' చేసేవారు పట్టించుకోవడం లేదు. వాటి గురించి పొరపాటున ఎవరైనా ప్రశ్నించడానికి ప్రయత్నిస్తే.. 'తీసేవాళ్ళు తీస్తున్నారు, చూసే వాళ్ళు చూస్తున్నారు, మధ్యలో మీ బాధేంటి?..అన్నట్లుగా గుడ్లెర్రజేస్తున్నారు.

ఎవరు ఏమైపోయినా తమకు కావాల్సింది మాత్రం వ్యూస్, అంతే. అందరూ చూడాలనే కదా తీస్తున్నాం.. అంటున్నారు మరికొందరు. అంతేకాదు, ఒకవేళ తమ 'రీల్స్'కి వ్యూస్ తగ్గిపోతే, ఆ నిరాశతో కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారంటే ఈ పిచ్చి యువతను ఎంతగా ఆవహిస్తోందో ఊహించుకుంటేనే భయమేస్తుంది!

### సాహసోపేత రీల్స్...!

మామూలు రీల్స్ చేస్తే ఎవరు చూస్తారు...? ఎవరూ చేయలేని సాహసాలు చేసి చూపిస్తే ఎక్కువమంది చూస్తారు. వ్యూస్‌లు, లైకులు పెరిగి డబ్బులు కూడా బాగా వస్తాయి. ఇదీ యువత ఆలోచన. ఆ దిశగానే వారి అడుగులు పడుతున్నాయి. అందుకోసం, వేగంగా వెళ్తున్న వాహనాలని, నదులని, ఎత్తైన కొండలని, గుట్టలని, సముద్రాన్ని 'రీల్స్' కోసం ఎన్నుకుంటున్నారు. రకరకాల సాహస విన్యాసాలతో వ్యూయర్లను ఆకట్టుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. చేతులారా ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. ఇటీవల ఓ యువకుడు రైలు పట్టాల మధ్యలో ఉన్న స్థలంలో పడుకుని, రైలు తన మీదనుంచి వెళ్లాక లేచి కూర్చోవడం, వంటి సాహసం చేయడం చూస్తే.. ఒళ్లు గగుర్పొడుస్తుంది. ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగుంటే వారి తల్లితండ్రుల ఆవేదనను ఎవరు తీర్చగలరు?..

'రీల్స్' కోసం ఇలా చాలామంది తమ ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. తరచూ అనేక విషాద సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. పదుల సంఖ్యలో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. పనికిమాలిన 'రీల్స్' కోసం కన్నవారికి కన్నీటిని, కడుపుకోతని మిగులుస్తున్నారు. ఇలాంటి ఘోరాలు ఎన్ని జరుగుతున్నా 'రీల్స్' తీసేవారు ఏ మాత్రం మారడం లేదు. క్యాన్సర్ కంటే ప్రమాదకరమైన ఈ 'రీల్స్' పిచ్చిజబ్బుతో సమాజం ఏమైపోతుందో ఆ భగవంతుడికే ఎరుక..!

- రాజశ్రీ

# ఆదర్శనేత ఆనం వెంకన్న!

సమోన్నత లక్ష్యాలు, అత్యున్నత ఆశయాలు, ఆదర్శ భావాలు, నైతిక విలువలు ఉన్న పాతతరం నాయకులలో ఒకరుగా ఆనం వెంకటరెడ్డి గారు ప్రసిద్ధి. మా చిన్నతనంలో పలు సందర్భాలలో ఆయన గురించి, ఆయన సేవాతత్వం గురించి విని సంబరపడేవాళ్ళం. ఇచ్చిన మాటకి కట్టుబడి, చెప్పిన విషయాన్ని తూ.చ. తప్పకుండా ఆచరించే వ్యక్తిగా వెంకన్నని ఆ తరం జనం కొనియాడేవారు. స్వర్గీయ ఏసీ సుబ్బారెడ్డి గారి తరువాత ఆనం కుటుంబ కీర్తిని, ప్రతిష్టని కాపాడడంలో వెంకటరెడ్డి గారి కృషి చాలా ఉంది. ఇప్పుడు ఆయన వారసుడు ఆనం రామనారాయణరెడ్డి గారు కూడా ఆనం పరంపరని అదే తరహాలో కొనసాగిస్తున్నారు. ఒక్క నెల్లూరుజిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే గుర్తింపు కలిగిన రాజకీయ కుటుంబంగా ఆనం కుటుంబం ఖ్యాతి గడించడం విశేషం. నెల్లూరు నగరంలో ఆనం వెంకటరెడ్డి గారి విగ్రహం పునః ప్రతిష్ఠించి, హరనాథపురం - రామలింగాపురం కూడలికి ఆనం వెంకటరెడ్డి సర్కిల్‌గా నామకరణం చేయడం ఆనందదాయకం.

- వి. మృత్యుంజయరెడ్డి, రిటైర్డ్ టీచర్, నెల్లూరు.

# రచ్చలకి దారితీస్తున్న ఛానళ్ళ చర్చలు!

తరచూ వార్తాఛానళ్ళలో వస్తున్న అనేక చర్చలు అనవసరపు వివాదాలకి దారితీస్తున్నాయి. తాజాగా సాక్షి టీవీ డిబేట్లో కృష్ణంరాజు అనే పాత్రికేయుడు అమరావతిపై చేసిన కామెంట్‌పై నడుస్తున్న వివాదం కూడా ఇలాంటిదే. న్యూస్ ఛానళ్లలో చర్చలు, డిబేట్‌లు నిర్వహించేటప్పుడు కొన్ని నియమనిబంధనలు పాటిస్తే బాగుంటుంది. అసలు ఇలాంటి చర్చలని, డిబేట్లని ప్రత్యక్ష ప్రసారాలలో కాకుండా ప్రీ రికార్డింగ్ ద్వారా ప్రసారం చేయాలి. అలాచేస్తే అభ్యంతరకర వ్యాఖ్యలని, కామెంట్లని సెన్సార్ చేయడానికి అవకాశం ఉంటుంది. కళ్ళముందు కెమెరా, నోటిముందు మైకు వున్నాయి కదా అని ఈ చర్చలలో చాలామంది ఒళ్ళు మరచి రెచ్చిపోయి మాట్లాడుతున్నారు. అర్థంలేని వివాదాలకు తెరలేపుతున్నారు. అమరావతి లాంటి అంశాలు పునరావృతం కాకుండా ఉండాలంటే వార్తా ఛానళ్ళ పంథా మారాలి. లైవ్‌డిబేట్లకి స్వస్తి పలకాలి. ప్రీ రికార్డింగ్ చర్చా విధానాన్ని పరిచయం చేయాలి. అందుకోసం వార్తాఛానళ్ళ యాజమాన్యాలు సమన్వయంతో వ్యవహరించాలి. అప్పుడే ఇలాంటి వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

- ఆర్. వి. రామయ్య - కొండాయపాలెం.

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## బుక్కులతో బెదిరింపులు సమంజసం కాదు!

గత వారం మన 'లాయర్'లో మొదటి పేజీలో వచ్చిన "మాతో పెట్టుకుంటే బుక్కైపోతారు" అన్న విశ్లేషణ చాలా బాగుంది. పాలనపై దృష్టి పెట్టాల్సిన నేతలు పగలు, ప్రతీకారాలపై ఫోకస్ పెడుతున్నారు. మేము అధికారంలోకి వస్తే కూటమి పాలనని మరిపించేలా పాలన అందిస్తాం అని చెప్పాల్సిన ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి వాళ్ళ పదిమందిని లోపలేస్తే మేము అంతకి రెట్టింపుగా 20మందిని జైళ్ళ పాలు చేస్తాం అని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది. ప్రజలకి మంచి పరిపాలన అందించడానికి వీళ్ళు పార్టీలు పెట్టారా లేక కొట్టుకుని చావడం కోసం రెండు ముఠాలుగా ఏర్పడ్డారా? అన్న అనుమానం కలుగుతోంది. ఇలా రెండు ప్రధాన ప్రాంతీయ పార్టీలు కొట్టుకుని చస్తుంటే రాష్ట్ర భవిష్యత్తు అధోగతి పాలు కావడం ఖాయం. ఇదే పోకడ కొనసాగితే ప్రజలు ప్రాంతీయపార్టీలని వదిలిపెట్టి జాతీయ పార్టీల వైపు చూడడం ఉత్తమం అన్నది నా అభిప్రాయం.

లక్ష్మీభరద్వాజ్ - హైదరాబాదు.




## వింజమూరులో.. 'శంకర్ నేత్రాలయ' ఉచిత కంటి శిబిరం

మండలకేంద్రమైన వింజమూరుకు చెందిన దాతలు..ఎన్ఆర్ఐ శేగు సతీష్, శేగు సుబ్బారావు, నిర్మల కుటుంబ సభ్యుల సహకారంతో ఇటీవల వింజమూరులో శంకర నేత్రాలయ–చెన్నై వారు ఉచిత నేత్రచికిత్సా శిబిరం నిర్వహించి రోగులకు కంటి పరీక్షలు చేశారు. స్థానిక వైఆర్ జూనియర్ కళాశాలలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఏబిఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షుడు.. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ, ప్రపంచ ప్రఖ్యాత శంకర నేత్రాలయ వారు వింజమూరులో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం పేద ప్రజలకు గొప్ప సహాయం చేసినట్లవుతుందని కొనియాడారు. దాత శేగు సుబ్బారావు మాట్లాడుతూ, 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసి' అన్న విధంగా పుట్టిన ఊరికి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడానికి తమ కుటుంబానికి ఒక గొప్ప అవకాశం లభించినట్లయిందని సంతోషం వ్యక్తం చేశారు. వైద్య శిబిరం ప్రధాన నిర్వాహకుడు యల్లాల రఘురామిరెడ్డి మాట్లాడుతూ, ఈ కంటి శిబిరం జూన్ 6 నుండి 14వ తేదీ వరకు కొనసాగుతుందని, అవసరమైతే మరిన్ని రోజులు శిబిరాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ శిబిరాన్ని దాదాపు వెయ్యి మందికి పైగా పేదలు ఉపయోగించుకుంటారని భావిస్తున్నట్లు చెప్పారు. శంకర్ నేత్రాలయ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ రంజిత్ మాట్లాడుతూ, అధునాతన కంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగివున్న మొబైల్ వాహనాల ఆపరేషన్ థియేటర్ల ద్వారా అవసరమైనవారికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు అక్కడికక్కడే చేయడం జరుగుతుందని చెప్పారు. గ్రామ ప్రముఖులు.. ప్రజాప్రతినిధులు వి.సుబ్బారెడ్డి, గణపం బాలకృష్ణారెడ్డి, గురిజాల వెంకట రమణయ్య, డాక్టర్ మాసిలామణి, నల్లగొండ్ల సుజాత, గొంగటి రఘునాథరెడ్డి, వైఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయుఎస్)కి చెందిన ఉపాధ్యాయులు వెంగయ్య, శ్రీనివాసులు, తిరుపాలు, కొండారెడ్డి, చలమయ్య, సుబ్బారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, గోపి పర్యవేక్షించారు.

## పరిహారం ఇప్పించండి మహాప్రభో!

### కలెక్టరేట్ వద్ద బాధితుల ఆందోళన



బద్వేలు–నెల్లూరు జాతీయరహదారి నిర్మాణానికి భూములిచ్చిన తమకు ఇవ్వాల్సిన పరిహారాన్ని ఇప్పించండి మహాప్రభో అంటూ పలు గ్రామాలకు చెందిన రైతులు ఈనెల 9న నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. భూములు కోల్పోయిన తమకు పరిహారం ఇవ్వడంలో జాప్యం జరుగకుండా ఆదుకోవాలని, వెంటనే పరిహారం ఇప్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని వారు జిల్లా అధికారులను కోరారు. ఆమేరకు వినతిపత్రాన్ని ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఉన్న అధికారులకు అందజేశారు.

## 'ఉపాధిహామీ' బకాయిలు ఇప్పించండి సారూ!

### సీపీఎం నాయకుల వినతి



కోవూరు మండలంలోని ఉపాధి హామీ కూలీలకు ఇవ్వాల్సిన కూలి బకాయిలు నేటికీ చెల్లించకపోవడంతో, ఆ కష్టజీవులు కుటుంబ పోషణకు అనేక అవస్థలు పడుతున్నారని కోవూరు సీపీఎం మండల కమిటీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ మేరకు ఈనెల 9న ఎంపీడీఓ శ్రీహరికి వినతి పత్రం అందజేసి, కూలీల బకాయిలు త్వరితగతిన చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం నాయకులు బి. పెద్దబ్బయ్య, గండవరపు విజయకుమార్, పి.జానకిరామయ్య, మల్లికార్జునరావు, బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కు కార్మికులను..విధుల్లోకి తీసుకోవాలి

విశాఖలోని ఉక్కు కర్మాగారంలో తొలగించిన నాలుగువేల మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ నెల్లూరులోని సీఐటీయు నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 9న వారు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ధర్మాందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉక్కు కర్మాగారంలో ఉత్పత్తి తక్కువగా ఉందంటూ కేంద్ర ప్రభుత్వం కార్మికులను పనుల్లోంచి తొలగించడం అన్యాయమని, వారిని తిరిగి పనుల్లోకి తీసుకోవాలని కోరారు. సీఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, రూరల్ మండల శాఖ కార్యదర్శి పెంచలనరసయ్య, నాయకులు కొండా ప్రసాద్, అల్లాడి గోపాల్, నరసింహారెడ్డి, సుధాకర్, కోటేశ్వరరావు, సురేష్, సుబ్బయ్య పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో.. విఆర్ హైస్కూల్!

### • మంత్రి నారాయణ కుమార్తె షరణి




పేద విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించాలనే సంకల్పంతో తమ తండ్రి.. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో చేపట్టిన విఆర్‌హై స్కూల్ ఆధునీకరణ పనులు చివరి దశకు చేరుకున్నట్లు పొంగూరు షరణి తెలిపారు. కార్పొరేట్ స్కూల్స్‌కి ధీటుగా సిద్ధమవుతున్న పేదపిల్లల పాఠశాల విఆర్ హైస్కూల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఇటీవల ఆమె పరిశీలించి, పనుల పురోగతిని అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి తరగతి గదికి వెళ్లి ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. ఫర్నిచర్‌ను, ప్లే గ్రౌండ్‌ను చూసి, పనులు నాణ్యతగా, వేగంగా చేస్తున్నారంటూ సంబంధిత సిబ్బందిని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చరిత్రాత్మకమైన ఈ పాఠశాల ఎంతోమంది ప్రజా ప్రతినిధులను, వ్యాపారవేత్తలను, మేధావులను సమాజానికి అందించిందన్నారు. అంతటి చరిత్ర ఉన్న వీఆర్ హైస్కూల్‌ను వైకాపా హయాంలో మూతవేయడం దారుణమంటూ ఆమె మండిపడ్డారు. తమ నాన్న పేద కుటుంబం నుంచి వచ్చారని.. అందువల్ల పేదల కష్టాలు తమ కుటుంబానికి బాగా తెలుసన్నారు. విఆర్‌లోనే చదివిన తమ నాన్నగారు ఇప్పుడు మంత్రిగా ఉన్నత స్థాయికి ఎదిగారని, అందుకే వీఆర్ హైస్కూల్‌ని నిరుపేద పిల్లల భవిష్యత్తు కోసం ఆధునీకరించాలని నాన్నగారు సంకల్పించారన్నారు. ఆధునీకరణ పనులు పూర్తి కావచ్చాయని, ఇంటర్నేషనల్ స్కూల్స్‌కి ధీటుగా ఈ పాఠశాల రూపుదిద్దుకొంటోందని తెలిపారు. ఇక్కడ ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. డిజిటల్ విద్యను పేదపిల్లలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు.

## చిన్నారులకు పౌష్టికాహారం

వేసవి సెలవుల్లో ఆటల కోసం ఏసి సుబ్బారెడ్డి స్టేడియానికి వస్తున్న చిన్నారులకు స్మైల్ వాకర్స్, వివేకానంద వాకర్స్, ఏసి సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో అందిస్తున్న పౌష్టికాహారాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ చిన్నారులకు అందించారు. ఇటీవల స్మైల్ వాకర్స్ అసోసియేషన్ నిర్వాహకుల ఆధ్వర్యంలో అరటిపండ్లు, కోడిగుడ్లను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. చిన్నారులను ఆటల పట్ల ప్రోత్సహిస్తూ వారికి పౌష్టికాహారాన్ని అందిస్తున్న దాతలను, వాకర్స్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. నెల్లూరు నగర పాలకసంస్థ కమిషనర్ నందన్, డిప్యూటి డైరెక్టర్ మాధురి, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి యతిరాజ్, జిల్లా ఆయూష్ అధికారి గోవిందయ్య, యోగా గురువులు తదితరులు పాల్గొన్నారు.

## బాలూ పాటలు, మాటలు మర్చిపోలేం!



### ప్రముఖ గాయని బి.రమణ

గానగంధర్వుడు, ప్రఖ్యాత సినీగాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా ఇటీవల నెల్లూరు టౌన్ హాలులో స్థానిక 'చేతన' సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా బాలూ సోదరి..ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, సినీనటుడు శుభలేఖ సుధాకర్, బాలు కుటుంబ ఆత్మీయుడు వీరిశెట్టి హజరత్‌బాబు తదితరులు పాల్గొని బాలూ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి ఆ మహాగాయకుని స్మరించుకున్నారు. అనంతరం, బాలూతో కలసి వేలాది పాటకచ్చేరీలు చేసిన ప్రముఖ సినీ గాయని బి.రమణకు 'మధురగాయని' బిరుదునిచ్చి, బాలూ అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాలూ భౌతికంగా లేకపోయినా..ఆయన పాటలు మాటలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. తొలుత, బాలూ సినీ చిత్ర గీతావళి కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు పాల్గొని బాలూ పాటల వైభవాన్ని గుర్తుకు చేసుకున్నారు. సినీ రచయిత డాక్టర్ రాజేంద్రప్రసాద్, చేతన కార్యదర్శి శేషగిరీశం తదితరులు పాల్గొన్నారు.

## కోళ్ల వ్యర్థాలు..'ఆగేదే లే'!

### ప్రజల ఆరోగ్యంతో..చేపల పెంపకందార్ల చెలగాటం

జిల్లాలో కోళ్ల వ్యర్థాలు వేసి చేపలను పెంచే అనైతిక వ్యాపారానికి అడ్డే లేకుండాపోతోంది. ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులు హెచ్చరిస్తూనే ఉన్నా, చేపలగుంటల సాగుదారులు ఖాతరు చేయడం లేదు. చేపలసాగుకు వినియోగించాల్సిన నాణ్యమైన మేతను వేయకుండా, కాసుల కోసం కక్కుర్తిపడి గబ్బు కొట్టి, పురుగులు పట్టిన కోళ్ళ వ్యర్థాలను చేపలగుంటల్లో వేస్తున్నారు. వాటిని తిన్న చేపలు పొట్ట ఉబ్బి బరువు బాగా తూగుతాయని సాగుదారులు దురాశతో ఈ వ్యాపారానికి మళ్ళుకున్నారు. కలుషిత ఆహారం తిన్న ఆ చేపలను కొని, వాటిని తినడం వల్ల ప్రజల ఆరోగ్యం నాశనమైపోతున్నా వారు పట్టించుకోవడం లేదు. జిల్లాలోని అనేక గ్రామాల్లో, పొలాల్లో జరుగుతున్న ఈ చేపలసాగును ఆయా మండలాల్లోని అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంతో, ఎంతోకాలంగా ఈ కలుషిత చేపలసాగు విపరీతంగా పెరిగిపోతోంది.

**కుళ్ళిన వ్యర్థాలే చేపల మేత :**

చెన్నై, బెంగుళూరు తదితర ప్రాంతాల్లో చికెన్ కోసం కోసి పారేసిన కోళ్ల వ్యర్థాలను అక్కడివాళ్ళెవరూ తినరు. వాటిని పారేయకుండా డ్రమ్ముల్లో నిల్వ ఉంచి, జిల్లాలోని చేపలగుంటల వారికి అత్యంత తక్కువ ధరకు అమ్మేస్తుంటారు. ఇదే అదనుగా ఇక్కడి చేపలగుంటల వాళ్ళు పెద్దపెద్ద డ్రమ్ముల్లో వాటిని వాహనాల్లో వేసుకుని, దొంగదారుల్లో చెక్‌పోస్టులను సైతం అవలీలగా దాటుకుని వచ్చేస్తుంటారని, అనేక గ్రామాల్లో చాలామంది చేపలగుంటల వాళ్ళు చేపలగుంటల్లో ఆ కుళ్లిపోయిన కోళ్ళ వ్యర్థాలనే మేతగా వేసి పెంచుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ కలుషిత చేపల సాగు నియంత్రణకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు, నిఘా బృందాలు రంగంలోకి దిగితే తప్ప, ప్రజారోగ్యాన్ని నాశనం చేసే ఈ వ్యాపారానికి అడ్డుకట్ట పడదని ప్రజల భావిస్తున్నారు.

### దామరమడుగు వద్ద రెండు వాహనాలు పట్టివేత

కోళ్ళ వ్యర్థాలను తీసుకువెళ్తున్న రెండు వాహనాలను బుచ్చి పోలీసులు ఈనెల 9న పట్టుకున్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని దామరమడుగు వద్ద ఒక వాహనాన్ని, జొన్నవాడ సమీపంలోని పొర్లుకట్ట వద్ద మరో వాహనాన్ని బుచ్చి ఎస్ఐ సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. బెంగుళూరు నుంచి కోళ్ళ వ్యర్థాలను వాహనాల్లో వేసుకుని, బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని ఆర్ఆర్ నగర్, పెనుబల్లి, శ్రీరంగరాజపురం, దామరమడుగు వరకు ఆ కోళ్ళ వర్థాలను సరఫరా చేస్తున్నారని, ఆ వ్యర్థాలను చేపలగుంటల్లో చేపలకు మేతగా వేస్తున్నారని ఆయన తెలిపారు. గబ్బుకొడుతున్న ఆ వ్యర్థాలను స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేశామని తెలిపారు.

# 13న నెల్లూరుకు రానున్న షర్మిల



ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 13న నెల్లూరుకు వస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఈనెల 10న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జరిగే సమావేశానికి రాష్ట్ర నాయకులతో పాటు జిల్లా నాయకులు, నియోజకవర్గాల పార్టీ సమన్వయ కర్తలు, జిల్లా-మండల అనుబంధ సంఘం అధ్యక్షులు, సీనియర్ నాయకులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నెల్లూరుకి కొత్త ఆర్టీఓ

నెల్లూరుకి కొత్త ఆర్టీఓ (ప్రాంతీయ రవాణా అధికారి) రానున్నారు. ఆ శాఖలో బదిలీల్లో భాగంగా ఈనెల 10న జంగారెడ్డిగూడెం ఆర్టీఓగా ఉన్న మదానిని నెల్లూరు ఆర్టీఓగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు. ఆయనకు గతంలో నెల్లూరు డీటీసీ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహించిన అనుభవం కూడా ఉంది. అదేవిధంగా, నెల్లూరు ఆర్టీఓగా ఉన్న వై.శ్రీచందనను మార్కాపురం ఆర్టీఓగా బదిలీ చేశారు.

# ఏఎంసీ కార్యదర్శిగా శ్రీనివాసులు

నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీగా కావలి ఏఎంసీ సెక్రటరీ ఎం.శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం ఈనెల 10న ఉత్తర్వులిచ్చింది. అదేవిధంగా, పెనుగొండ ఏఎంసీ కార్యదర్శి టీసీ రామాంజనేయులును కావలి ఏఎంసీకి, కోవూరు ఏఎంసీలో ఓడీగా ఉన్న టీ.శ్రీనివాసులును కడపకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో దుగ్గిరాల ఏఎంసీ కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావును నియమించారు.

# 'ఫ్రెండ్స్ వాకర్స్'..మజ్జిగ వితరణ



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్న మజ్జిగ వితరణ కార్యక్రమం 41వ రోజు.. ఈనెల 10న ముగిసింది. చివరిరోజున వాకర్స్ నాయకులు 660 ప్యాకెట్ల మజ్జిగను పంపిణీ చేశారు. అదేరోజున యువరత్న నందమూరి బాలకృష్ణ 65వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరాభివృద్ధి సంస్థ ఛైర్మన్..బాలకృష్ణ అభిమాని కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి 15కేజీల కేకును కట్‌చేసి అందరికీ పంచారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా 300 మందికి ఉపాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలకి సహకరించిన వారందరినీ వాకర్స్ ఆధ్వర్యంలో సన్మానించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ కిలారి శ్రీనివాసులునాయుడు, సెక్రటరీ జి.నారాయణరెడ్డి, ట్రెజరర్ మాగుంటి ప్రసాద్, మాజీ ప్రెసిడెంట్..ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, కిలారి మధుసూదనరావు, ఎన్ సుధాకర్ చౌదరి, కిలారి తిరుపతినాయుడు, కె.రఘురాం ముదిరాజ్, వినుకొండ వెంకటేశ్వర్లు, కొండూరు సుబ్బారావు, జి.వి.కృష్ణయ్య, కిలారి వరుణ్ పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# 'యోగా'కి..10 లక్షల మంది నమోదు



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న యోగాంధ్ర అవగాహన కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోందని, జిల్లాలో ఇప్పటివరకు సుమారు 10లక్షల మంది యోగా మీద మక్కువతో రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని నెల్లూరుజిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ చెప్పారు. మానసికంగా, శారీరకంగా అద్భుత ప్రయోజనాలు కలిగించే 'యోగా'..అందరి జీవితాల్లో భాగం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈనెల 6న నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన రెసిడెన్షియల్ థీమాటిక్ రాష్ట్రస్థాయి సామూహిక యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 124 మంది మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి, వారిద్వారా సుమారు 7000 మందికి గ్రామ, వార్డు స్థాయిలో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున జిల్లాలో 2వేల ప్రదేశాల్లో నిర్వహిస్తున్న యోగా కార్యక్రమాల్లో ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యోగా గురువు స్వప్న ఆధ్వర్యంలో చిన్నారులు సాధన, దివ్య వేసిన యోగాసనాలు అందరిలో స్ఫూర్తిని కలిగించాయి.

# రక్తదాత సాయిరామ్‌కి..సన్మానం




ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శాఖ రక్తనిధి కేంద్రంలో ఇటీవల రక్తదాత అరిగెల సాయిరాంను ఘనంగా సన్మానించారు. రక్తప్రేరేపకులుగా సేవలందిస్తున్న అరిగెల సాయిరాం తన 60 సంవత్సరాల వయసులో సైకిల్‌మీద పర్యటిస్తూ రక్తదానం మీద ప్రజలలో అవగాహన కోసం కృషిచేయడాన్ని వక్తలు ఈ సందర్భంగా అభినందించారు. మే 8న ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం రోజున జిల్లాలో తన సైకిల్ యాత్రను ప్రారంభించి ములుముడి, జొన్నవాడ, బుచ్చి, వెంకటాచలం, కొడవలూరు, రాజుపాలెం, అల్లూరు తదితర ప్రాంతాల్లో రక్తదానం ప్రాముఖ్యతను వివరిస్తూ, ఈనెల 7న తన పర్యటనలో వెయ్యి కిలోమీటర్ల పూర్తిచేసుకోవడం విశేషం. ఈ సందర్భంగా నెల్లూరులోని రెడ్ క్రాస్ రక్తనిధిలో కన్వీనర్ సి.హెచ్.అజయ్‌బాబు, అడ్వయిజర్ మలిరెడ్డి కోటారెడ్డి చేతుల మీదుగా ఆయన చిరు సత్కారం అందుకున్నారు. బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వరప్రసాద్, రెడ్ క్రాస్ మెడికల్ షాప్ కన్వీనర్ యు.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




నెల్లూరు బీసీ భవన్‌లో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో 'సేవారత్న' డా. చుక్కా కొండయ్య యువత ఉపాధికి చేస్తున్న సేవలను అభినందిస్తూ సన్మానిస్తున్న రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుయాదవ్

# రంగనాథస్వామి వసంతోత్సవాలు

నెల్లూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారికి వసంతోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 10 నుంచి ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడురోజులపాటు ఆలయంలో నవ కలశ స్నపన తిరుమంజనం, విశేష పుష్పాలంకారం, దివ్యప్రబంధ గోష్ఠి, ఆస్థాన సేవ తదితర సేవలు కన్నుల పండువగా జరిగాయి.

# బాలూ పాటలు అజరామరం




విశ్వవిఖ్యాత సినీ నేపథ్యగాయకుడు..మన నెల్లూరీయుడు..తన మధురాతి మధురమైన గానంతో అశేష ప్రజలను విశేషంగా ఆకట్టుకున్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటలు నేటికీ మార్మోగుతూనే ఉన్నాయని, ఆయన పాటలు అజరామరమని వక్తలు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిమ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్-నెల్లూరు డివిజన్ కోఆర్డినేటర్..ప్రముఖ దర్శకుడు-నటుడు-రచయిత కళాంజలి అనంత్ ఆధ్వర్యంలో ఈనెల 4న బాలూ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. నెల్లూరులోని ఆదిత్యనగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత బాలూ పార్కులో ఉన్న బాలూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలూ పాడిన పాటలను గానం చేసి, ఆ మహాగాయకుడిని స్మరించుకున్నారు. ఫిలిమ్ ఛాంబర్ సభ్యులు, నిర్మాత నాగకిషోర్, ప్రముఖ రంగస్థల-టీవీ నటుడు దువ్వూరు బెనర్జీ, మహిళా ప్రతినిధి నిర్మలమ్మ, మురళీ మోహన్‌రావు, ఇసనాక దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'ఆరోగ్య భారత్' కోసమే యోగ




సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ఫీల్డ్ ఆఫీస్, భారత ప్రభుత్వం, నెల్లూరు వారి ఆధ్వర్యంలో ఏసీ సుబ్బారెడ్డి గవర్నమెంట్ మెడికల్ కళాశాల సహకారంతో అంతర్జాతీయ యోగా దినోత్సవంపై అవగాహన కార్యక్రమాన్ని గవర్నమెంట్ మెడికల్ కళాశాల ఆవరణంలో బుధవారం రోజున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రాజేశ్వరి ప్రారంభించి, మాట్లాడుతూ జూన్ 21వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుతున్న సందర్భంగా వైద్య కళాశాలలో యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ఫీల్డ్ ఆఫీసు, క్షేత్ర ప్రచార సహాయకులు పి.హరికృష్ణ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన భారతావని నిర్మాణం కోసం యోగాను ఒక సాధనంగా ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరుజిల్లా సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.వెంకటేశ్వరావు, ఏపీ టూరిజం జిల్లా అధికారి ఉషశ్రీ, యువజన అధికారి మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# తహశీల్దార్ల బదిలీలు

జిల్లాలో పనిచేస్తున్న 22 మంది తహశీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కార్తీక్ ఈనెల 10న ఉత్తర్వులు జారీచేశారు. డిప్యూటీ తహశీల్దార్లుగా పనిచేస్తున్న ముగ్గురికి అడహాక్ తహశీల్దార్లుగా ఉద్యోగోన్నతులు కల్పించారు. వారిలో, తిరుపతిలో కలెక్టరేట్‌లో పనిచేస్తున్న కె.శ్రీనివాసులుకు తహశీల్దారుగా ఉద్యోగోన్నతి కల్పించారు. డిప్యూటీ తహశీల్దార్లుగా ఉన్న ఎస్‌కె ఫాజిహాను అల్లూరు తహశీల్దారుగా, కలెక్టర్‌లో డిప్యూటీ తహశీల్దారు ఎల్.రామమోహన్‌ను ఉదయగిరి తహశీల్దారుగా నియమించారు. 36 మంది డిప్యూటీ తహశీల్దార్లు, 42 మంది సీనియర్ అసిస్టెంట్లను పలు మండలాలకు బదిలీ చేశారు. మరో 15 మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు.

# ప్రజానేత..ఆనం వెంకటరెడ్డి!

## జిల్లాకు ఆ మహనీయుని సేవలు అపారం..అమూల్యం!

### - విగ్రహ పునరావిష్కరణ సభలో నేతలు



జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రజానేత, ధీరోదాత్తుడు.. రాజకీయ యోధుడు ఆనం వెంకటరెడ్డి జిల్లా ప్రజలకు చేసిన సేవలు అపారం.. అమూల్యమని వక్తలు కొనియాడారు. జిల్లాలో పలు నీటి ప్రాజెక్టులకు ఆయనే ఆద్యులని, అప్పట్లో రాష్ట్ర హోంమంత్రిగా, నీటిపారుదల శాఖ మంత్రిగా ఆనం వెంకటరెడ్డి నెల్లూరుజిల్లా ప్రజలకు ఎనలేని సేవలందించారని గుర్తుచేసుకున్నారు. ఈనెల 8వ తేదీన నెల్లూరు నగరంలోని రామలింగాపురం కూడలిలో ఆనం వెంకటరెడ్డి విగ్రహాన్ని పునరావిష్కరించిన సందర్భంగా, ఆనం కుటుంబసభ్యులు, సింహపురి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అనేకమంది ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిలు ఆనం వెంకటరెడ్డి కాంశ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా.పొంగూరు నారాయణ, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాకర్ల సురేష్, డివి కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, పాశం సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, నెల్లూరుజిల్లాను సస్యశ్యామలం చేసిన ఘనత ఆనం వెంకటరెడ్డిదేనన్నారు. ఈ సందర్భంగా ఆనం వెంకటరెడ్డితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తమ తండ్రి శివకోటారెడ్డితో ఆనం వెంకటరెడ్డికి ప్రత్యేక అనుబంధం ఉండేదన్నారు. జిల్లాలోని సోమశిల ప్రాజెక్టు ఉదయగిరిలో గండిపాలెం ప్రాజెక్టు, రాళ్లపాడు వంటి ప్రాజెక్టులను తీసుకువచ్చారన్నారు.

ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, ఎన్డీసీసీబీ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, టిడ్కో ఛైర్మెన్ అజయ్‌కుమార్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, ఆనం వెంకటరెడ్డి మనుమరాలు కైవల్యారెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నేత చేవూరు దేవకుమార్‌రెడ్డి, బీజేపీ నేతలు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, కమ్యూనిస్టు పార్టీ నేత మాదాల వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధర్, జనసేన నాయకులు, ఆనం సోదరులు, వారి కుటుంబసభ్యులు, ఆనం అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### మహోన్నత నేత..ఆనం వెంకటరెడ్డి - మంత్రి నారాయణ

ఆనం వెంకటరెడ్డి మహోన్నత నేత అని పురపాలక మంత్రి నారాయణ అన్నారు. విఆర్ కళాశాల అభివృద్ధికి ఆయనెంతో కృషిచేశారని గుర్తుచేసుకున్నారు. తొలినుంచీ ఆనం కుటుంబం నైతిక విలువలతో రాజకీయాలు చేస్తూ, ప్రజల హృదయాల్లో నిలచిపోయిందన్నారు. అనంతరం ఆనం వెంకటరెడ్డి జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని మంత్రి నారాయణ ఆవిష్కరించి, తొలిప్రతిని ఎంపీ వేమిరెడ్డికి అందించారు.

### ప్రజాసేవే ఆనం కుటుంబ లక్ష్యం - మంత్రి ఆనం

తమ తండ్రి ఆనం వెంకటరెడ్డి ప్రజాసేవే లక్ష్యంగా పనిచేశారని, అన్ని పార్టీల నాయకులతో కూడా ఆయన సఖ్యంగా ఉంటూ రాజకీయాల్లో అద్వితీయంగా రాణించారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. రైతు కుటుంబం నుంచి రాజకీయాల్లో ఎదిగిన కుటుంబం తమదని అంటూ, తమ పెదనాన్న ఏసీ సుబ్బారెడ్డి వద్ద నుంచి నాలుగు తరాలుగా జిల్లా ప్రజల సంక్షేమానికి తమ కుటుంబం పనిచేస్తోందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా నాటి నుంచి నేటికీ రాజకీయరంగంలో ఉంటూ కృషిచేస్తూనే ఉన్నామన్నారు. ఆ మంచి పేరుతోనే.. ప్రజల ఆదరణతో ఆనం కుటుంబం రాజకీయాల్లో రాణిస్తోందన్నారు. ఈ సందర్భంగా, ఆత్మకూరు నియోజకవర్గ పోలీసు విభాగానికి ఆత్మకూరుకు చెందిన పలువురు దాతలు సమకూర్చిన ఆరు వాహనాలను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌కి అందజేశారు.



లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాని ఇటీవల ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి.

## ప్రజల కంటివెలుగుగా..

# త్వరలో 'విపిఆర్ నేత్ర'

### - ఎమ్మెల్యే ప్రశాంతమ్మ



తమ దాతృత్వంతో జిల్లాలో అనేక ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు, దీనులకు, దివ్యాంగులకు తమవంతు సేవలందిస్తున్న మహాదాత.. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి త్వరలోనే నేత్రసమస్యలతో సతమతమవుతున్న వారి కష్టాలు తీర్చి, వారి జీవితాలకు కొత్త వెలుగులు ప్రసరింపజేయనున్నారు. ఆమేరకు ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించడానికి సమాయత్తమవుతున్నారు. ఈనెల 10న నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని తమ నివాసంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, త్వరలోనే విపిఆర్ సారధ్యంలో, విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'విపిఆర్ నేత్ర' సేవా కార్యక్రమం ప్రారంభం కాబోతుందని చెప్పారు. అనంతరం, కోవూరు నియోజకవర్గానికి సంబంధించి 12 మంది దివ్యాంగులకు విపిఆర్ ఫౌండేషన్ తరఫున ఆమె విద్యుత్ ట్రై సైకిల్స్ అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులతో ఆమె ప్రత్యేకంగా మాట్లాడి, వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 950 మంది దివ్యాంగులకు ట్రై సైకిల్స్ అందించామని, నడవలేని దివ్యాంగులకు ఆ ట్రై సైకిల్స్ ఎంతో ఉపయోగపడుతున్నాయని వివరించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆలోచనల నుంచి ఆవిర్భవించిన ఈ కార్యక్రమం భవిష్యత్తులోనూ ఇలాగే కొనసాగుతుందని వెల్లడించారు.

## ఆర్యవైశ్య విద్యార్థులకు ఉచిత భోజన, వసతి గృహం

నెల్లూరులోని ప్రముఖ ఆధ్యాత్మిక సేవాసంస్థ శ్రీ పాండురంగ అన్నదాన సమాజం వారి ఆధ్వర్యంలో ప్రతిఏటా పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఉచిత భోజన వసతి గృహం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది కూడా 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి నుండి డిగ్రీ వరకు చదువుకునే విద్యార్థులందరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీ పాండురంగ అన్నదాన సమాజం కార్యదర్శి చలువాది వెంకటేశ్వర్లు (వైభవ్ శ్రీనివాస్), హాస్టల్ కమిటీ ఛైర్మెన్ వాయుగుండ్ల హజరత్తయ్యలు ఈనెల 6న ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. జూన్ 6వ తేది నుంచి దరఖాస్తు ఫారాలు ఇస్తున్నామని, జూన్ 28వ తేదీ వరకు దరఖాస్తు ఫారాలు స్వీకరిస్తామని, అనంతరం 29న హాస్టల్‌లో చేరే విద్యార్థులకు సంబంధించిన తుది జాబితా ప్రకటిస్తామని వారు తెలిపారు. వివరాలకు పాండురంగ అన్నదాన సమాజంలో సంప్రదించవచ్చు.

# శ్రీసిటీలో..నవగ్రహ, రాశి, నక్షత్ర వనాలు!

### శ్రీ విశ్వ వల్లభ తీర్థ స్వామీజీ చేతుల మీదుగా ప్రారంభం



ప్రపంచ ప్రఖ్యాతిచెందిన పారిశ్రామిక వాడగా పేరొందిన శ్రీసిటీలో.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇటీవల అరుదైన రీతిలో నవగ్రహ, రాశి, నక్షత్ర వనాలను ఏర్పాటు చేశారు. గొప్ప ఆధ్యాత్మిక, సామాజిక ప్రాముఖ్యత కలిగిన కర్ణాటకలోని ఉడిపి అష్ట మఠాలలో ఒకటైన సోదే వాదిరాజ మఠం 36వ పీఠాధిపతి పూజ్యశ్రీ విశ్వ వల్లభ తీర్థ స్వామీజీ చేతుల మీదుగా వాటికి ప్రారంభోత్సవం జరగడం విశేషం. స్వామీజీ ఇటీవల తన శిష్య బృందంతో కలసి శ్రీసిటీని సందర్శించారు. వారికి స్థానిక బిజినెస్ సెంటర్ వద్ద శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, ఉపాధి, పచ్చదనం, పర్యావరణ హిత కార్యక్రమాలను స్వామీజీకి వివరించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ పరిశ్రమల సీఈఓలు, నివాసితుల సమావేశంలో పాల్గొన్న స్వామీజీ, శ్రీసిటీ విశేష అభివృద్ధికి.. రవీంద్ర సన్నారెడ్డి చేస్తున్న కృషికి దైవానుగ్రహం కూడా తోడుగా నిలిచిందన్నారు. శ్రీసిటీ పేరులోనే దైవబలం అంతర్లీనమై ఉందన్నారు. శ్రీసిటీ మరింత ఉన్నతిని సాధించాలని దీవిస్తూ, సమావేశంలో పాల్గొన్న వారందరికీ ఆశీస్సులు అందచేశారు. అనంతరం ఆయన శ్రీసిటీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకొని, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నవగ్రహ, రాశి, నక్షత్ర వనాలను ప్రారంభించారు. డా. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, ఏకాదశి రోజున స్వామీజీ రాక శ్రీసిటీకి దక్కిన అరుదైన గౌరవం, అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం మరుసటి రోజే వనాలు ప్రారంభం కావడం హర్షదాయకమని, ప్రకృతిని పరిరక్షించడంలో శ్రీసిటీ నిబద్ధతను బలోపేతం చేస్తుందన్నారు.




# వలసపక్షులపై ట్రంప్ వేట!

మనసులో మాట 49

అక్రమ వలసదారులను అమెరికా నుంచి పంపించేయడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కంకణం కట్టుకుని వారిని అరెస్టు చేస్తున్న నేపథ్యంలో అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో మొదలయిన నిరసనలు తీవ్రరూపం దాల్చాయి. అంతకంతకూ విస్తరిస్తున్నాయి. కాలిఫోర్నియాలోని శాన్‌ఫ్రాన్సిస్కో, శాంతా అనా, టెక్సాస్‌లోని డాలస్, ఆస్టిన్‌లకు, న్యూయార్క్‌కు విస్తరించాయి. లాస్‌ఏంజెలెస్‌లో వేలమంది జనం వీధుల్లోకి వచ్చి ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారిని అదుపు చేసేందుకు ట్రంప్ యంత్రాంగం నేషనల్ గార్డ్స్‌ను రంగంలోకి దించింది. ఈ చర్య తీవ్ర వివాదాస్పదమయింది. నేషనల్ గార్డ్ బలగాలు రాష్ట్రాలు, ఫెడరల్ ప్రభుత్వానికి సంబంధించిన సంయుక్త బలగాలు. సాధారణంగా రాష్ట్రాల్లో శాంతి భద్రతల వ్యవహారాలు రాష్ట్రాలే చూసుకుంటాయి. అరుదుగా మాత్రమే రాష్ట్రాలు కోరినప్పుడు ఈ బలగాలను రంగంలోకి దించాల్సి ఉంటుంది. అయితే అధ్యక్షుడికి ఉన్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించుకుని ట్రంప్ ఆ బలగాలను రంగంలోకి దింపడంతో నిరసనలు తీవ్ర రూపం దాల్చాయి. ఆందోళనకారులను అడ్డుకునేందుకు భద్రతా దళాలు బాష్పవాయువు, రబ్బర్ తూటాలను, పొగ బాంబులను, చెవులు చిల్లులు పడే శబ్దాలను ప్రయోగించాయి. దీనితో నిరసనకారులు ప్రతిదాడులకు దిగారు. నిరసనలు శాంతియుతంగా మొదలయినా నిరసనకారుల ముసుగులో కొందరు వాహనాలకు నిప్పు పెట్టడం, లూటీలు చేయడం వంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడడంతో పరిస్థితి మరింత తీవ్ర రూపం దాల్చింది.

నేషనల్ గార్డ్స్‌కు తోడు పెంటగాన్ 700 మంది మెరైన్లను లాస్‌ఏంజెలెస్‌లో మోహరించింది. మెరైన్స్ అంటే అమెరికా నావికా సైన్యంలో భాగం. వారు సముద్రంలోనూ, భూభాగంలోనూ పోరాడతారు. సరిహద్దుల్లోనో, సముద్రజలాల్లోనూ శత్రువులపై పోరాడాల్సిన బలగాలను అమెరికా భూభాగంలో నివసిస్తున్న వారికి వ్యతిరేకంగా రంగంలోకి దించడమంటే బతుకు తెరువు కోసం వలస వచ్చిన వారిని, వారికి మద్దతుగా నిలుస్తున్న అమెరికా పౌరులను కూడా ట్రంప్ యంత్రాంగం శత్రువులుగా భావిస్తోందా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నేషనల్ గార్డ్స్‌ను రంగంలోకి దించడంపై కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ మండిపడ్డారు. అక్రమంగా నేషనల్ గార్డ్స్‌ను మోహరించడం తమ రాష్ట్ర సార్వభౌమత్వాన్ని కాలరాయడమే అని న్యూసమ్ అక్షేపించారు. అమెరికా జీవన విధానానికి ట్రంప్‌ను ముప్పుగా అభివర్ణించారు. అమెరికా సాంస్కృతిక, రాజకీయ ప్రమాణాలకు ఆయన విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.

రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేయకుండా అక్కడ నేషనల్ గార్డులను నేరుగా మోహరించడం గత కొన్ని దశాబ్దాల్లో ఇదే ప్రథమం. అమెరికా అనేది వివిధ రాష్ట్రాల సముదాయం. ప్రతి రాష్ట్రానికీ సొంత రాజ్యాంగం ఉంటుంది. అమెరికా బయటి శత్రువుల నుంచి తమ రాష్ట్రాన్ని రక్షించుకోవడానికి అన్ని రాష్ట్రాలూ కలిసి అమెరికా ఫెడరల్ ప్రభుత్వంగా ఏర్పడ్డాయి. అమెరికా ఫెడరల్ ప్రభుత్వం ఇష్టాను సారం రాష్ట్రాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి వీల్లేదు.

లాస్‌ఏంజెలెస్‌లో తొలుత నిరసనలను ప్రారంభించింది హిస్పానిక్స్ కాగా ఆ తర్వాత వారికి మద్దతుగా అన్ని వర్గాల వారూ నిరసనల్లో పాల్గొంటున్నారు. స్పానిష్ భాష మాట్లాడే మెక్సికో జాతీయులను సాధారణంగా హిస్పానిక్స్ అని పిలుస్తారు. అమెరికా కార్మిక శక్తిలో వారిది కీలకపాత్ర. వారు లేకపోతే వ్యవసాయ రంగం సంక్షోభంలో పడుతుంది. ముఖ్యంగా పంటల కోత, గ్రేడింగ్, ప్యాకింగ్ వంటి పనుల్లో వారు నైపుణ్యం ఉన్నవారు. వ్యవసాయ రంగం, మత్స్య రంగంలో ఉన్న కార్మికుల్లో 43.4శాతం మంది హిస్పానిక్స్ కానీ లాటినోలు కానీ ఉంటారు. భవనాలు, భవనాల ఆవరణలు, రహదారుల పరిశుభ్రత, నిర్వహణ వంటి పనుల్లోనూ వారి వాటా 36.7శాతం. నిర్మాణ రంగంలోనూ వారి శ్రమ ఉంటుంది. పైగా తక్కువ వేతనాలకు పని చేస్తారు. అందుకే యజమానులు వారిని నియమించుకోవడానికి ప్రాధాన్యమిస్తారు.

మరోవైపు మెక్సికోలో సరైన ఉపాధి అవకాశాలు, సరైన జీవన ప్రమాణాలు లేక, అమెరికాలో మెరుగ్గా ఉంటుందన్న ఆశతో వారు అమెరికాకు వలస వస్తుంటారు. ఒకరకంగా వారు అమెరికా జీవన స్రవంతిలో అంతర్భాగంగా మారిపోయారు. అందుకే కాలిఫోర్నియా గవర్నర్.. ట్రంప్ చర్యలను అమెరికా జీవన విధానానికి ముప్పు అన్నారు. వారిలో చట్టబద్ధ పత్రాలు లేకుండా వచ్చేవారే ఎక్కువగా ఉండే మాట వాస్తవమే. అయితే వారితో ప్రయోజనం ఉంది కాబట్టి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు కానీ అమెరికా ఫెడరల్ ప్రభుత్వం కానీ శతాబ్దాలుగా చూసీ చూడనట్లు వదిలేస్తున్నాయి. కానీ ట్రంప్ మాత్రం అక్రమ వలసదారులెవరైనా పంపించేయాల్సిందే అన్న మొండిపట్టుతో ఉండడంతో అది ఇప్పుడు తీవ్ర నిరసనలకు దారి తీసింది. వలసలు అనేవి మానవ చరిత్రలో అనివార్యం.

మెరుగైన జీవన ప్రమాణాల కోసం వలస వెళ్లేది కొందరయితే బతుకు తెరువు కోసం వెళ్లేది కొందరు. అసలు అమెరికా అనే దేశమే వలసవాదులతో ఏర్పడింది. అది మరిచిపోయి బతుకు తెరువు కోసం వలస వచ్చేవారిని శత్రువులుగా చూడడం సరికాదు. వారిని గౌరవప్రదంగా సొంత దేశాలకు తిప్పిపంపించాలి. లేదంటే అక్రమంగా వలసరాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. ట్రంప్ కొంత మానవత్వాన్ని నేర్చుకోవాలి.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**



## జానకిరామ.. రామాయణం 69

- ఊటుకూరు జానకి రామారావు

దానిని విచారించిన ఏమి ప్రయోజనం.

రామా సాక్షాత్తూ దేవగురువు బృహస్పతి అయినా నీకు బోధించ సమర్థుడు కాడు, నీకు తెలియని ధర్మమేముంది?

కేవలం శోకం చేత కప్పబడిన నీ జ్ఞానాన్ని మేలుకోల్పుటకే నేను ఈ విషయాలు చెపుతున్నాను.

జనులు నడిచే కాలి బాటలో దీనుడై నిస్సహాయంగా పడి ఉండి కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న పక్షిరాజు జటాయువును చూడగానే రామునిలో శోకం వరద గోదావరి అయ్యింది.

అయ్యో ఎంత దురదృష్టవంతుడను నేను.

రాజ్యం పోయింది..

వనవాసం ప్రాప్తించింది..

జీవన సహచరి జాడ లేకుండగా పోయింది...

నా తండ్రికి మిత్రుడు, వృద్ధుడు, తండ్రి వంటి జటాయువు కూడా మరణించినాడు.

ఆహా ఏమి నా దౌర్భాగ్యం!

ఇది అగ్నిని కూడా కాల్చివేయగలదు, ఇప్పటికిప్పుడు నేను మహాసముద్రంలో దూకినచో నా దౌర్భాగ్యపు వేడి సెగలు సంద్రాన్ని కూడా ఆవిరి చేయగలవు.

రక్తపు సరస్సులో తేలియాడుతున్న ఆ జటాయువు శరీరాన్ని కౌగలించుకొని నా ప్రాణమైన సీత ఎక్కడ ఉంది అని మాత్రం పలికి నేలమీద పడిపోయాడు శ్రీరాముడు.

లక్ష్మణా చూశావా, నా కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా నెంచిన ఈ మహానుభావుడి దురవస్థ చూశావా.. నాడి చాలా దుర్బలంగావుంది.

కంఠస్వరం చాలా బలహీనంగా ఉంది.

ఓ జటాయూ నీకు మాట్లాడగలిగే శక్తి ఉన్నట్లైన ఒక్కసారి సీత విషయం, నీ వధ విషయం మాకు ఎరిగింపుము.

ఏ కారణం చేత రావణుడు సీతను అపహరించినాడు?

నేను అతనికి చేసిన అపకారమేమి?

ఆ సమయంలో నా సీత ఎలా ఉంది?

ఎట్లా అయిపోయింది?

నీతో ఏమి చెప్పింది?

ఆ రాక్షసుడెవ్వడు?

ఆతని రూపమెద్ది?

ఎట్టి పరాక్రమవంతుడు?

వాడు ఎచటివాడు?

తండ్రీ నాకు సమాధాన మెరిగింపుము అని ఆతురతతో, ఆవేదనతో జటాయువును ప్రశ్నిస్తున్నాడు రామచంద్రుడు.

రాముని ప్రశ్నలను విన్న జటాయువు నెమ్మదిగా కళ్లువిప్పి రాముని వైపు చూస్తూ క్షీణించిన స్వరంతో, రామా! రాక్షసరాజైన రావణుడు మాయామేఘాలను, అధికమైన గాలినీ సృష్టించి ఆకాశ మార్గాన అతివ సీతను అపహరించి తీసుకొనిపోయాడు.

సీతను రక్షించుటకొరకై నేను వానితో యుద్ధం చేయగా, నేను అలసిపోయిన సమయంలో వాడు నా రెక్కలు తెగనరికి సీతను తీసుకొని దక్షిణ దిక్కుగా వెళ్ళినాడు.

రామా ఇక నా ప్రాణాలు ఎక్కువసేపు నిలువవు. నా కంటికి బంగారపు చెట్లు అగుపడుతున్నాయి. (మృత్యువు ఆసన్నమైన వారికి బంగారపు చెట్లు కనపడతాయట).

రావణుడు సీతను అపహరించిన ముహూర్తం "విందము", ఈ ముహూర్తమందు పోయిన సంపదలు, ధనం యజమానికి తిరిగి లభిస్తాయి, ఈ విషయం ఆ రాక్షసుడు గమనించలేదు.

రామా నీకు శుభమగుగాక అని అంటూ నోటినుండీ, ముక్కునుండీ రక్తం స్రవిస్తూ ఉండగా తిరిగి మాటలాడాడు, రామా ఆ రాక్షసుడు విశ్రవసుని కుమారుడు, సాక్షాత్తూ కుబేరుని సోదరుడు అని చెపుతూ చెపుతూ ప్రాణాలు వదలినాడు.

వినువీధులలో హాయిగా ఎగురుతూ నచ్చిన ఆహారాన్ని భుజిస్తూ క్రూర రాక్షసులకు నిలయమైన ఈ జనస్థానంలో నివసిస్తున్న గృధ్రరాజు జటాయువు నా కొరకు తన ప్రాణాలర్పించాడుకదా!

ఎప్పటివాడీయన?

మన తండ్రి తాతల కాలం నాటివాడు. వృద్ధుడు, అయినా ధర్మం కోసం తనప్రాణాలను తృణప్రాయంగానెంచినాడు కదా!

ఆహా! ధర్మమార్గాన్ని అవలంబించువారు తిర్యగ్జంతువులలో కూడా ఉన్నారనడానికి ఈ జటాయువే నిదర్శనం.

అయ్యో కాలాన్ని ఎవ్వరూ దాటలేరుకదా !

లక్ష్మణా! జటాయువు మరణం బాధించినంతగా సీతాపహరణం వలన కలిగిన దుఃఖము కూడా బాధించలేదు.

మన తండ్రి నాకు ఎంత పూజ్యుడో, గౌరవింప తగినవాడో



జటాయువు కూడా అంతే పూజింప తగినవాడు, గౌరవింప తగినవాడు.

లక్ష్మణా వెంటనే చితిపేర్చు, అగ్ని మంథనం చేసి ఈయనకు దహన సంస్కారాలు చేయవలె.. అని చెప్పగా లక్ష్మణుడు అన్న ఆజ్ఞను పాటించి చితి పేర్చాడు.

రాముడు జటాయువు శరీరాన్ని చితిపై పరుండబెట్టి శాస్త్రోక్తంగా మంత్రాలు పఠిస్తూ నిప్పంటించాడు.

తన బంధువుకు జరిపినట్లుగా పిండప్రదానాది కార్యక్రమాలన్నిటినీ, పితృదేవతల కొరకై జపించవలసిన అన్ని మంత్రాలనూ జపిస్తూ జటాయువుకు అంతిమ సంస్కారాలు పూర్తిచేశాడు రాఘవుడు.

ఆ అరణ్యంలో అడుగుతీసి అడుగువేసే సందు కూడా లేదు. చాలా దట్టంగా అల్లుకుపోయిన పొదరిండ్లు, మహా వృక్షాలూ, లతలతో అల్లుకుపోయిన దారులూ చాలా క్లిష్టమైన, దుర్గమమైన అరణ్యమది.

ఓపికగా దారులు చేసుకుంటూ ఏ ప్రమాదం ఎదురైనా దానిని కాచుకునే విధంగా ఆయుధాలతో సదా సన్నద్ధతో ఉండి దక్షిణ దిక్కుగా అడుగులు వేస్తున్నారు రామలక్ష్మణులిరువురూ.

వెళ్లే మార్గంలో కనపడ్డ ప్రతి పొదనీ ప్రతిగుహనీ సీతాదేవి కోసం గాలిస్తున్నారు, అప్పటికే వారు జనస్థానం నుండి మూడు క్రోసుల దూరం వచ్చేశారు.

అది క్రౌంచము అనే అరణ్య ప్రాంతం. ఆ అరణ్యాన్ని దాటేసారిరువురూ.

మరల ఎత్తైన పర్వతాలతో కూడిన ఇంకొక అటవీ ప్రాంతంలో ప్రవేశించారు. అక్కడ ఒక పర్వతం మొదట్లో ఒక పెద్ద గుహ కనపడ్డది వారికి.

ఆ గుహలో వారు సీతాదేవిని గురించి వెదుకబోగా... పెద్ద ఆకారం, వికృతమైన ముఖం, వేలాడే బానపొట్ట, ఎత్తుపల్లాలతో కూడిన అవయవాలు, విరబోసుకున్నజుట్టు, తీక్షణమైన కోరలుకలిగి భయంకరంగా ఉన్న ఒక రాక్షస స్త్రీ కనపడ్డది.

ఆ స్త్రీ లక్ష్మణుని చూడగానే... రా! సుందరా! నాతో రమింతువుగాని అంటూ మీద మీదకు వచ్చి ఆయనను కౌగలించుకొని, వీరుడా నా పేరు అయోముఖి, నీవే నా ప్రియుడవు, నాథుడవు అంటూ కౌగిలి బిగించి వేయసాగింది.

క్షణమాలస్యం చేయక లక్ష్మణుడు దాని ముక్కు చెవులు కోసి వేయగా అది వికృతంగా అరుస్తూ, గావుకేకలు పెడుతూ అరణ్యంలోనికి పారిపోయింది.

మరల ప్రయాణం సాగించారు ఇద్దరూ. కొంతదూరం ప్రయాణించిన తరువాత లక్ష్మణుడు అంజలి ఘటించి అన్నగారితో, అన్నా నా బాహువు ఎందుచేతనో మాటిమాటికీ అదురుతుంది, మనస్సును ఎదో చెప్పరాని దిగులు ఆవరిస్తుంది, అరిష్టసూచకాలైన అపశకునాలు కనపడుతున్నాయి.

రామా! మనకేదో ఆపద రాబోతున్నట్లుగా ఉంది, అది ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండుము అని పలికాడు.

ఇంతలో ఒక భయంకరమైన పక్షికూత విన్నాడు. అది వంచులకము అనే పక్షిది, ఆ కూతను విశ్లేషణ చేసి, ఇదుగో ఈ పక్షి కూత రాబోవు యుద్ధంలో జయం మనదే అని తెలియ చేస్తుంది.

మనం యుద్ధ సన్నద్ధులమై ఉండవలెను అని మాట్లాడుకుంటూ నడక సాగిస్తున్నారు.

నడుస్తున్న వారికి ఎక్కడనుండో అరణ్యంలోని చెట్లనన్నింటినీ విరిచివేస్తున్నట్లుగా ఒక మహాశబ్దం వినపడ్డది.

ఆ వనమంతా పెనుగాలితో నిండిపోయింది.

ఎక్కడ నుండి వచ్చిందీ శబ్దం?

రామ లక్ష్మణులు నలుదిక్కులా పరికించి చూడగా ఒక పొదలో పెద్ద శరీరం, విశాలమైన పొట్ట ఉన్న రాక్షసుడు కనపడ్డాడు.

ఆ రాక్షసుడి పేరు కబంధుడు.

అతని దేహం చాలా చిత్రంగా ఉంది.

.. (సశేషం)



# మైమరపించిన బాలూ పాటలు

ప్రపంచ ప్రఖ్యాత గాయకుడు, పద్మవిభూషణుడు శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యం (ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం) జయంతిని పురస్కరించుకుని ఈనెల 8న నెల్లూరు టౌన్‌హాలులో బాల గాంధర్వ గాన సభ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'రాగం–తానం–పల్లవి' కార్యక్రమం ఆద్యంతం అద్వితీయంగా జరిగింది. ప్రముఖ గాయకులు కనకరాజు, జనార్ధన్, రమేష్, ఉమా మహేష్, గాయనీమణులు సుభద్రాదేవి, ప్రశాంతి, శ్రీవల్లి, ఉమ తదితరులు బాలూ పలు సినిమాల్లో పాడిన పాటలను తమ మధురస్వరాలతో గానం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. బాలూ గంధర్వగానాన్ని మరోసారి వినిపించి శ్రోతలను మైమరపింపజేశారు. బాలూ పాటలతో ఆ కీర్తిమూర్తికి స్వరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రముఖులు డా. హైటెక్ రమణారెడ్డి, ప్రముఖ గాయకుడు.. అభినవ ఘంటసాల బిరుదాంకితుడు పాటూరు శ్రీనివాసులు, బాలూ ఆత్మీయ మిత్రుడు జి.వి మురళిలకు గానసభ వారు బాలు స్మారకంగా పురస్కారాలను ప్రదానం చేశారు.

# ఆకట్టుకున్న.. శోభాయాత్ర

'జై శ్రీరామ్–జై హనుమాన్' అంటూ రామభక్తులు చేపట్టిన శోభాయాత్రతో పొదలకూరు పట్టణం భక్తజన కోలాహలంతో సందడిగా మారింది. ఈనెల 8న హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేలసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక రామ్‌నగర్ గేట్ కూడలి వద్ద నుంచి కెఆర్‌ఆర్ కాలనీవద్దనున్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వరకు జరిగిన మోటార్ బైక్ ర్యాలీ అందరినీ ఆకట్టుకుంది. శ్రీరాముడు, శ్రీ ఆంజనేయస్వామిల విగ్రహాలను ఊరేగిస్తూ, ప్రజల్లో రామభక్తిని చాటారు. రాజకీయాలకు అతీతంగా పలు పార్టీల నాయకులు, ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద నుంచి ఆర్యవైశ్యులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. శోభాయాత్రలో ఎలాంటి ఇబ్బందులు జగరకుండా ఎస్ఐ హనీఫ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

### తీపి జ్ఞాపకాలతో..

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బడి చదువుల నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ఆ చిన్ననాటి స్నేహితులంతా కలసి ఆనందంగా గడిపారు. ఇన్నేళ్ళ తర్వాత ఎవరెక్కడ ఉంటున్నారో, జీవితంలో ఎలా స్థిరపడ్డారో తెలుసుకుంటూ, ఒకరినొకరు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జడ్పీ ఉన్నత పాఠశాల అందుకు వేదికైంది. 1987–88లో ఆ పాఠశాలలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఈనెల 8న ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తాము చదువుకున్న ఆ పాఠశాలలోని గదులన్నీ కలియదిరుగుతూ, అప్పట్లో జరిగిన పలు సంఘటనలను తలచుకుని సంతోషపడ్డారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి, వారికి కృతజ్ఞతలు చెప్పుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యాయులు మస్తానయ్య, సారాబాయ్, చంద్రమౌళిలను దుశ్శాలువలతో సన్మానించుకున్నారు. పూర్వ విద్యార్థులు కరణాల హరిబాబు, చౌకచర్ల సురేష్‌రెడ్డి, షేక్ మస్తాన్, మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మహ్మద్ ఫయాజ్, దినేష తదితరులు ఈ సమ్మేళనాన్ని అద్భుతంగా నిర్వహించారు.

### ఎన్‌బికెఆర్‌లో 20 నుంచి..

# ఎన్‌సిసి శిక్షణా శిబిరం



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు 10 (ఏ) నావెల్ యూనిట్ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గౌదాంగవే ఆధ్వర్యంలో వార్షిక శిక్షణా శిబిరం నిర్వహించనున్నారు. నెల్లూరు, తిరుపతి, గుంటూరు, ప్రకాశం, కడప, అనంతపురం జిల్లాల నుంచి ఈ శిబిరానికి సుమారు 650 మంది ఎన్‌సిసి క్యాడెట్లు హాజరవుతారని భావిస్తున్నారు. అందుకు అవసరమైన వసతుల ఏర్పాటు కోసం నావెల్ యూనిట్ కార్యాలయ సూపరింటెండెంట్ ముకుంద్‌సాగర్, పర్మనెంట్ ఇన్స్‌పెక్టర్ వి.లక్ష్మణ్‌కుమార్, కళాశాల నావెల్ యూనిట్ ఎన్‌సిసి అసోసియేట్ ఆఫీసర్ డా.వి.మల్లికార్జునరెడ్డిలు ఇటీవల ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డిని కలిసి చర్చించారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, జెఎన్‌టీయుఏ, అనంతపురం విశ్వవిద్యాలయంలోని అనుబంధ కళాశాలల్లో ఉన్న తమ కళాశాలలో మాత్రమే ఆర్మీ, నేవీ ఎన్‌సిసి విభాగాలు ఉన్నాయని, తమ కళాశల కరెస్పాండెంట్ రామ్‌కుమార్‌రెడ్డి విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇస్తారన్నారు. ఎన్‌సిసి ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, స్నేహభావం, దేశభక్తి, సమాజంపై అవగాహన ఏర్పడతాయన్నారు. విద్యార్థులు ఈ ఎన్‌సిసి శిక్షణా శిబిరం ద్వారా డ్రిల్, షిప్ మోడలింగ్, ట్రెక్కింగ్, రక్తదానం, ఫైర్ ఫైటింగ్, యోగ తదితర అంశాల పట్ల మంచి అవగాహనను పెంపొందించుకునే అవకాశం ఉందన్నారు. అంతేకాక, నావెల్ కమ్యూనికేషన్, నావెల్ ఓరియంటేషన్, సీమన్‌షిప్, సెమాఫోర్ వంటి ప్రత్యేక అంశాలతో పాటు, వివిధ క్రీడాంశాల్లోనూ శిక్షణ ఇస్తారని, ప్రతి ఏటా తమ కళాశాలలో ఎన్‌సిసి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తూనే ఉన్నామన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# ఆరోగ్యానికి యోగా ఎంతో ముఖ్యం

### ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్




ఆరోగ్యానికి యోగా ఎంతో ముఖ్యమని, యోగా చేయడం వల్ల మానసిక శారీరక ఉల్లాసం పెరుగుతుందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా గూడూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఇటీవల అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వం స్టేడియం నుండి టవర్ క్లాక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ర్యాలీలో వాకర్స్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగా వల్ల అనారోగ్య సమస్యలు రావని, కరోనా వచ్చినప్పటికీ కొందరు తొందరగా కోలుకున్నారని గుర్తు చేశారు. ఈ నెల 21వ తేదీ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖలో 5 లక్షల మందితో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కట్టా మురళీకృష్ణ, పులిమి శ్రీనివాసులు, చెంచురామయ్య, మట్టం శ్రావణిరెడ్డి, ఆరికట్ల మస్తాన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



### గంగమ్మకు

# ప్రత్యేక పూజలు

గూడూరు రాజావీధిలో కొలువైవున్న శ్రీ గంగమ్మ తల్లి దేవస్థానంలో ఈ నెల 10వ తేదీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

# పదిహేను స్కూళ్ళకి స్పోర్ట్స్ కిట్‌లు



గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ సహకారంతో చిల్లకూరు, గూడూరు, చెన్నూరు, వాకాడులో ఉన్న 15 స్కూళ్ళకి ఎంఇఓ రవూఫ్ చేతులమీదుగా స్పోర్ట్స్ కిట్స్ అందజేయడం జరిగిందని జేవీవీ అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వం స్టేడియంలో నూతన గ్యాలరీ, ఓపెన్ జిమ్, ప్రహరీగోడలకు పెయింటింగ్ వేసి అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, సుమన్‌రెడ్డి, శర్మ, వెంకటేశ్వర్లు, లవకుమార్, రవూఫ్, పిడిలు తదితరులు పాల్గొన్నారు.

### నక్కలవారి కండ్రిగ

# భూములను పేదలకివ్వండి



ఏపీఐసీసి ఆధీనంలో ఉన్న నక్కలవారి కండ్రిగ భూములను రద్దుచేసి అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలని, ఇల్లు లేని వారికి ఇళ్ల స్థలాలు చూపించి, ఇల్లు కట్టించి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సిహెచ్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు చిల్లకూరు రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ మరియు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శశికుమార్, శ్రీనివాసరావు, గుండాల రమేష్, చెన్నూరు పరంధామయ్య, సుబ్బమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా ప్రసన్న వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

గూడూరు, రాజావీధిలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీప కాంతులతో అలంకరించారు. అర్చకులు విష్వక్సేనారాధన, కంకణ ధారణ, పుణ్యాహవచనం, అంకురార్పణ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం పల్లకి సేవ, సహస్రదీపాలంకరణ సేవలు జరిగాయి. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా శ్రీకంటి రామ్మోహన్ రావు – రాజ్యలక్ష్మి దంపతులు, గూడూరు శశిధర్‌రెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు.




వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలిగా తనను నియమించిన సందర్భంగా వైఎస్సార్సీపీ గూడూరు ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ మేరిగ మురళీని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న మొయిళ్ల గౌరి, సురేష్‌రెడ్డి.

# రోటరీ హెల్పేజ్

రోటరీ క్లబ్ 'హెల్పేజ్' కార్యక్రమంలో భాగంగా ఈనెల 10వ తేదీ అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ భవనంలో 25 మంది నిరుపేద వృద్ధులకు బియ్యం, పల సరుకులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి జి.జి. నాయుడు, రవికుమార్, శ్రీధర్‌నాయుడు పాల్గొన్నారు.

# కల్యాణ వైభవం...!




నెల్లూరు వాస్తవ్యులు వంజవాక వెంకట సతీష్‌రెడ్డి - శాంతిప్రియల కుమార్తె **లక్ష్మీ సన్నిహిత - కార్తీక్‌రెడ్డి** (కాకుపల్లి వాస్తవ్యులు సామంతుల మల్లికార్జునరెడ్డి - రాజేశ్వరిల కుమారుడు)ల వివాహం జూన్ 6న నెల్లూరులో వైభవంగా జరిగింది. కొత్త దంపతులకి 'లాయర్' శుభాశీస్సులు.

## ఎమ్మెల్యే కోటంరెడ్డి సారథ్యంలో..

# రూరల్‌లో వెల్లివిరిసిన..'చంద్రన్న పల్లెపండుగ'



నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల చంద్రన్న పల్లెపండుగ కార్యక్రమం అమోఘంగా జరిగింది. రూరల్‌లో నాలుగు రోజులపాటు 18గ్రామాలో చేపట్టిన 11 కోట్ల రూపాయల నిధులు, అభివృద్ధి పథకాలను ఆయా గ్రామాల ప్రజలకు ఆయన అంకితం చేశారు. చివరి రోజున నెల్లూరు నియోజకవర్గం, పొట్టేపాళెం గ్రామంలో వందలాదిమంది ప్రజల సమక్షంలో 'చంద్రన్న పల్లెపండుగ' సందడి వెల్లువెత్తింది. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో సంక్షేమం-అభివృద్ధి కార్యక్రమాలు అద్భుతంగా జరుగుతున్నాయన్నారు. 'తల్లికి వందనం' పేరుతో బిడ్డల చదువులకోసం కూడా నిధులను విడుదల చేస్తారన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం, రాష్ట్రం దశ, దిశా మార్చే పోలవరం ప్రాజెక్టు పనులు ఊపందుకున్నాయని, మన బిడ్డల భవిష్యత్తుకోసం పారిశ్రామిక పెట్టుబడులు వెల్లువలా రానున్నాయని చెప్పారు. గత వైకాపా విధానాలతో రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసినా, తన అపార అనుభవంతో చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతున్నారని ఆయన కొనియాడారు.

# రాష్ట్రంలో ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు!



## - ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ధ్వజం

కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు కనిపిస్తున్నాయంటూ వైకాపా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. నెల్లూరు వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇటీవల ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న మీడియాపై సీఎం చంద్రబాబు కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారన్నారు. సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్ అక్రమమన్నారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్రంలో నేడు రాక్షసపాలన సాగుతోందన్నారు. సాక్షి మీడియాకు చెందిన కార్యాలయాలపైన దాడులు దారుణమని అన్నారు. టీడీపీకి చెందిన సోషల్ మీడియాలో వైయస్ జగన్, ఆయన కుటుంబంపై గతంలో ఎటువంటి విషపూరితమైన ప్రచారం చేశారో అందరికీ తెలుసునని, అయినా ఏ ఒక్కరిపైనా జగన్ కక్షసాధింపులకు పాల్పడేందుకు ప్రయత్నించలేదని అన్నారు. గతంలో ప్రభుత్వంలో ఉన్నప్పుడు కూడా జగన్ అధికారాన్ని దుర్వినియోగం చేయలేదన్నారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం పనిచేస్తోందని, ప్రతిపక్షంలోని ప్రతి ఒక్కరినీ కేసులు పెట్టి వేధించాలని, ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు బనాయించాలన్న లక్ష్యంతో ఉందని ఆయన ఆరోపించారు. రెడ్‌బుక్ రాజ్యాంగంలో మీడియాకి కూడా రక్షణ లేదన్నారు. రాష్ట్రంలో తమ పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి టీడీపీ ఇలాంటి రాజకీయాలు చేస్తోందని ఆయన దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. శాంతిభద్రతల విషయంలో విఫలమైన ఇటువంటి దారుణమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని విమర్శించారు.

# విలువలతో కూడిన విద్య అవసరం



నేటి సమాజంలో విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడం ఎంతో ప్రధానమని, ప్రతిభను గుర్తిస్తూ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయడం ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించడం ముఖ్యమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. నెల్లూరు నగరంలోని డిజిపి కల్యాణ మండపంలో జిల్లా పద్మశాలీ సంఘం నాయకులు 10వ తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, టీడీపీ ముఖ్య నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన 100 మంది పద్మశాలీ విద్యార్థులను సన్మానించి నగదు పురస్కారం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ..విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లలో పోటీతత్వం పెరుగుతుందని అన్నారు. చిన్నారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఇంత మంచి కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేలా లక్ష్యం పెట్టుకుని పనిచేయాలని విద్యార్థులకు సూచించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి చిన్నపిల్లలంటే మక్కువ ఎక్కువని, అందుకే పేద పిల్లలను ఆదుకునేందుకు 'విపిఆర్ విద్య' పాఠశాలను ఏర్పాటు చేసి వారికి ఉచిత విద్యను అందిస్తున్నారన్నారు. జీవితంలో మానవతావిలువలతో కూడిన విద్య చాలా అవసరమన్నారు.

# విద్యార్థి ఉన్నత చదువుకు ఆర్థిక సహాయం

ఎందరో నిరుపేద విద్యార్థులు చదువుకోవాలనే తమ కలలను సాకారం చేసుకునేందుకు వారధిగా నిలుస్తున్న విపిఆర్ ఫౌండేషన్.. ప్రతిభ-పేదరికమే అర్హతగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి దంపతుల సారథ్యంలో ఎంతోమంది పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తోంది. అందులో భాగంగా వారు నెలకొల్పిన 'విపిఆర్ విద్య'లో మరెంతోమందికి కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య అందిస్తున్నారు. ఆ పాఠశాలలో 2023-24 సంవత్సరంలో చదివి ఉత్తమశ్రేణి మార్కులు సాధించిన ఉదయగిరి లక్ష్మిచరణ్ అనే విద్యార్థికి ఉన్నత చదువుల ఖర్చు తామే భరిస్తామని వారు ఇచ్చిన హామీ మేరకు ఆ విద్యార్థికి ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫీజు చెల్లించారు విపిఆర్ దంపతులు. విపిఆర్ నివాసంలో ఈనెల 11న విద్యార్థికి ఆ చెక్కును అందించి పేద పిల్లల విద్య పట్ల తమకున్న శ్రద్ధను చాటుకున్నారు. అనంతరం, విద్యాదాత ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలకు విద్యార్థి తండ్రి సురేష్ తన ధన్యవాదాలు తెలిపారు.

# సంపూర్ణ ఆరోగ్యం..యోగాతోనే సాధ్యం

## - ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



ఆరోగ్యకర జీవన విధానం, సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యమని అని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ అన్నారు. యోగాంధ్ర - 2025 కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయగిరి దుర్గం వద్దనున్న శ్రీ రంగనాయకుల స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో ఆయన, జిల్లా ఇన్‌ఛార్జి కలెక్యర్ కార్తీక్‌తో కలసి పాల్గొన్నారు. యోగాభ్యాసకులు పాల్గొన్నారు. యోగాగురువు స్వప్న ఆధ్వర్యంలో మానస, లాస్య, సెలీనా యోగాసనాలు వేయగా, అందరూ వారిని అనుసరించి యోగాసనాలు వేశారు. జూన్ 21న నిర్వహించే యోగా దినోత్సవ కార్యక్రమాల్లో ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొనాలని ఎమ్మెల్యే సురేష్ పిలుపునిచ్చారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న యోగాంధ్ర అవగాహన కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోందన్నారు.

# బడి ఈడు పిల్లలను..బడికి పంపాలి

## - డీఆర్‌ఓ ఉదయభాస్కర్‌రావు

బడిఈడు చిన్నారులందరిని బడికి పంపించి వారి బంగారు భవిష్యత్‌కు బాటాలు వేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కర్‌రావు చెప్పారు. ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం నగరంలోని గాంధీబొమ్మ నుంచి విఆర్‌సి వరకు జరిగిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువుకొని సమాజంలో ఉన్నతంగా ఎదగాల్సిన బాలలను బాలకార్మికులుగా వారిచేత పనులు చేయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. బాలలకు ఉజ్వల భవిష్యత్ అందించేందుకు ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్మికశాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పాఠశాలలు ప్రారంభమయ్యాని, బాలబాలికలందరినీ బడికి పంపించాలనే ఉద్దేశంతో ఈ అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. తల్లిదండ్రులందరూ తమ బిడ్డలను పనులకు కాకుండా బడులకు పంపించాలని కోరారు. మెరుగైన సమాజం కోసం బడిఈడూ పిల్లలందరూ విద్యనభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గౌస్‌బాషా, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ అనూరాధ, సీడీపీఓ అరుణ, బాలల సంరక్షణ అధికారులు సురేష్, సమత తదితరులు పాల్గొన్నారు.

## బదిలీలు-నియామకాలు

### జడ్పీ సీఇఓ బదిలీ :

నెల్లూరు జిల్లా పరిషత్ సీఇఓ విద్యారమను రాష్ట్రప్రభుత్వం నెల్లూరు నుంచి బదిలీ చేసింది. చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తిలోని ఉద్యోగుల శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్‌గా ఆమెను నియమిస్తూ తాజాగా ఉత్తర్వులిచ్చింది. ఆమె స్థానంలో సబ్ సీఇఓ మోహన్ రావును ఇన్‌ఛార్జిగా నియమించారు.

### తహాశీల్దార్లకు స్థానచలనం :

జిల్లాలో 22 మంది తహాశీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కె. కార్తీక్ ఈనెల 9న ఉత్తర్వులిచ్చారు. వారిని వివిధ మండలాలకు కేటాయించారు. మరో ముగ్గురు డిప్యూటీ తహాశీల్దార్లకు తహాశీల్దారు హోదా ఇచ్చారు. మరో 36 మంది డిప్యూటీ తహాశీల్దార్లను వివిధ మండలాలకు బదిలీ చేస్తూ ఆదేశాలిచ్చారు.

### బీసీ సంక్షేమ శాఖలో :

నెల్లూరు జిల్లా బీసీ సంక్షేమ శాఖలో ఈనెల 9న భారీగా బదిలీలు జరిగాయి. ఆ శాఖ కార్యాలయం సూపరింటెండెంట్ శ్యాంసన్‌ను గుంటూరు బీసీ సంక్షేమ కార్యాలయానికి బదిలీ చేసి, ఆ స్థానంలో ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న శ్రీనివాసులు రెడ్డిని నియమించారు. అదనపు బీసీ సంక్షేమాధికారులుగా పని చేస్తున్న పలువురిని డివిజన్లకు బదిలీ చేశారు. ఆత్మకూరులో పనిచేస్తున్న శ్రీదేవిని నెల్లూరు డివిజన్‌కి, నాయుడుపేటలో ఉన్న కృష్ణయ్యని ఆత్మకూరికి, ప్రకాశం జిల్లాలో ఉన్న జబ్బార్‌ను కందుకూరు డివిజన్‌కి, బాపట్ల జిల్లా రేపల్లెలో పనిచేస్తున్న ఏబీసీడబ్ల్యుఓ వి.అరుణమ్మను కావలికి బదిలీ చేశారు.

### సాంఘిక సంక్షేమశాఖలో :

జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వై.లూకాస్‌ను అమరావతిలోని డైరెక్టరేట్‌కి సరెండర్ చేస్తూ, ఆ శాఖ డైరెక్టర్ లావణ్యవేణి ఈనెల 9న ఉత్తర్వులిచ్చారు.

### నగరపాలక సంస్థలో :

నెల్లూరు నగరపాలక సంస్థలో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కె. హిమబిందును సిటీ ప్లానర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 9న ఆదేశాలిచ్చింది. ఇక్కడ సూపరింటెండెంట్‌గా ఉన్న ఎల్.చంద్రశేఖర్‌రెడ్డిని పెడన మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు.

### ఆర్టీసీలో :

నెల్లూరు ఆర్టీసీ జోనల్ కార్యాలయంలో ఆపరేషన్స్-కమర్షియల్ విభాగంలో పనిచేస్తున్న షేక్ షమీన్‌ను ఆర్టీసీ డిప్యూటీ సీటీఎంగా నియమిస్తూ ఆర్టీసీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈనెల 9న ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో గుంటూరు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి రవికాంత్‌ను నియమించారు.

### పురావస్తు శాఖలో :

పురావస్తు శాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా, నెల్లూరులోని పురావస్తు ప్రదర్శనశాల(మ్యూజియం), పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా డా. జరీనాబేగంను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆమేరకు ఆమెను విజయవాడ నుంచి నెల్లూరుకు బదిలీచేస్తూ ఉత్తర్వులిచ్చారు. నెల్లూరులో ఇప్పటివరకు ఆ స్థానంలో పని చేస్తున్న గంగాధరంను విజయవాడకు బదిలీ చేశారు.

### వ్యవసాయశాఖలో :

జిల్లా వ్యవసాయశాఖలో పలువురు అసిస్టెంట్ డైరెక్టర్లకు (ఏడీఏ) బదిలీలు, నియామకాలు జరిగాయి. తిరుపతి జిల్లా సూళ్ళూరుపేట ఏడీఏగా ఉన్న జి.అనితను కోవూరుకు, ఏడీఏ డి.సుజాతను జిల్లా వ్యవసాయశాఖకు బదిలీ చేశారు. జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ఏడీఏగా పనిచేస్తున్న శేషగిరిరావును వింజమూరుకు, ఇందుకూరుపేట ఏడీఏ ఏ.రాజ్‌కుమార్‌ను డీటీసీకి, ఏడీఏ సుమలతను ఇందుకూరుపేటకి బదిలీ చేశారు. ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మను డీటీసీలో నియమించారు.

### జిల్లా పరిషత్‌లో :

నెల్లూరు జిల్లా పరిషత్‌లో 65 మందిని బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఈనెల 10న ఆదేశాలు జారీచేశారు. అదే విధంగా జడ్పీ పంచాయతీశాఖలో 43 మంది అధికారులు, ఉద్యోగులను బదిలీ చేశారు.

## సోమేశ్వరాలయానికి..

# పూర్వ వైభవం!

### మంత్రి ఆనం చొరవతో...

### తొలివిడతగా 8.40 కోట్లు మంజూరు

### ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



అనంతసాగరం మండలంలోని సోమశిలలో పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన దేవాలయం.. శ్రీ సోమేశ్వరాలయం. ప్రతిరోజూ భక్తుల రాకపోకలతో ఈ ఆలయం కళకళలాడుతుండేది. అయితే, గతంలో వచ్చిన తుఫాన్ ప్రభావంతో పెన్నానదికి వరదలు వచ్చి, ఆలయం పూర్తిగా ధ్వంసమైంది. అప్పట్లో వెంకటగిరి శాసనసభ్యునిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి నీటిప్రవాహానికి దెబ్బతిన్న ఆ ఆలయాన్ని చూసి కలత చెందారు. ఆలయాన్ని పూర్తిస్థాయిలో పునర్నిర్మిస్తామని కూడా హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో రామనారాయణరెడ్డి కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కావడంతో ఈ ఆలయానికి మహర్దశ కలుగుతోంది. మంత్రి అయ్యాక ఆయన ఆలయ పునర్నిర్మాణానికి చొరవ చూపుతూ, తొలి విడతగా ప్రభుత్వం నుంచి 8 కోట్ల 40 లక్షల రూపాయల నిధిని మంజూరు చేయించారు. దీంతో ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు ఉప్పల విజయకుమార్, సోమ సుందరమూర్తిల ఆధ్వర్యంలో ఇటీవల శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన అధికారులు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్.శ్రీనివాసులు, అసిస్టెంట్ ఇంజనీర్ మురళి, ఏఓ కె.ప్రసాదరెడ్డి, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అనుకూలంగా రేషన్ షాపులు

### సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఈ నెల 1వ తేదీ నుంచి రేషన్‌షాపుల వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి, ప్రజలకు అనుకూలంగా రేషన్ షాపులు ఏర్పాటు చేసిందని సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త, ఎమ్మెల్యే సోమిరెడ్డి తనయుడు సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి చెప్పారు. తోటపల్లి గూడూరు మండలం కొత్తపాళెంలో ఇటీవల కొత్తగా రేషన్‌షాపు ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, రేషన్ షాపుల వ్యవస్థను ప్రజావసరాలకు తగినట్లుగా మార్పులు చేసి పున: ప్రారంభించడంతో ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోందని అన్నారు. లబ్ధిదారులు తమకు అనుకూలమైన సమయాల్లో వచ్చి సరుకులు తీసుకెళ్తున్నారని తెలిపారు. రేషన్‌షాపుల వ్యవస్థను గత వైకాపా ప్రభుత్వం గందరగోళం చేసిందని, ఇంటింటికీ బియ్యం పంపిణీ పేరుతో రూ.11వేల కోట్లతో వాహనాలు కొనుగోలు చేసిందని, అయితే ఏ రోజూ కూడా ఆ వ్యాన్లు ఇంటింటికీ రాలేదని, ఎక్కడో ఒక కూడలిలో కాసేపు వ్యాన్ ఉండేదని అన్నారు. ఆ వాహనం వచ్చిన సమయంలో ఏ కారణం వల్లనైనా సరుకులు తీసుకోలేని వారికి ఇక ఆ నెలలో లేనట్లేనని, కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ సరుకులు తీసుకోవడంలో ఉన్న ప్రజల సమస్యలను గుర్తించి పాత వ్యవస్థను పునరుద్ధరించిందన్నారు. కొత్తపాళెంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పంచాయతీ భవనాన్ని త్వరలోనే పూర్తి చేయించేందుకు, శ్మశానానికి వెళ్లే రోడ్డును బాగు చేసేందుకు తమ తండ్రి ఎమ్మెల్యే సోమిరెడ్డి త్వరలోనే చర్యలు తీసుకుంటారని తెలిపారు.

## రక్త సహాయకురాలు!

"రక్తాన్ని ధారవోసి గర్భమందలి శిశువుకు
జన్మనిచ్చిన స్త్రీ మాతృమూర్తి యగును
మరణశయ్యనున్న వారల బిడ్డకు రక్తం పంచి
మరుజన్మనిచ్చిన స్త్రీమూర్తి మాతృదేవత యగును!!"...

– (జూన్ 14, ప్రపంచ రక్తదాతల రోజు. మానవుల్లోని రక్తాన్ని వర్గీకరించి, మానవాళికి రక్తసహాయాన్ని సురక్షిత ప్రక్రియగా మార్చిన రుధిరశాస్త్ర పితామహుడు, ప్రఖ్యాత వైద్యులు కార్ల్ లేండ్ స్టైనర్ (14.6.1868-26.6.1943) పుట్టినరోజును.. ఆ మహనీయుని స్మరించుకుంటోంది.. నెల్లూరులోని సింహపురి స్వచ్ఛంధ రక్తదాతల బృందం)

– తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, 'ఓ-'
కార్యదర్శి, సింహపురి స్వచ్ఛంద రక్తదాతల బృందం

## టూకీగా...

### దంపూరులో డా.అంబేద్కర్ విగ్రహానికి శంకుస్థాపన

విడవలూరు మండలంలోని దంపూరు దళితకాలనీలో భారత రాజ్యాంగనిర్మాత డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠ కోసం అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఇటీవల శంకుస్థాపన జరిగింది. కోవూరు మార్కెటింగ్ మేనేజర్ పూండ్ల అచ్యుతరెడ్డి, మండల అధ్యక్షులు శ్రీహరిరెడ్డి, వంశీకృష్ణారెడ్డి, సర్పంచ్ సురేంద్రరెడ్డి, విజయరాఘవన్, పి.నారాయణ పాల్గొన్నారు.

### రామన్నపాళెంలో రైతులకు సూచనలు

కొడవలూరు మండలం రామన్నపాళెంలో ఈనెల 8న నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 'వికసిత్ కృషి సంకల్ప అభియాన్'లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. డివికె నాగేశ్వరరావు, డా. కె.కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంఏఓ శ్రీలక్ష్మి, నీహారిక పాల్గొన్నారు.

### కావలిలో యోగాంధ్ర ర్యాలీ

రానున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 9న కావలి పట్టణంలో యోగాపై అవగాహనకు ర్యాలీ నిర్వహించారు. కావలి మునిసిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ఆర్డీఓ వంశీకృష్ణ, మునిసిపల్ సిబ్బంది, సేవాసంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

### కొడవలూరులో 'హెల్మెట్' ధారణపై అవగాహన

మండలకేంద్రమైన కొడవలూరులో ఈనెల 9న ఎస్ఐ కోటిరెడ్డి ఆధ్వర్యంలో, ద్విచక్రవాహనదారులు ప్రమాదాల నుంచి రక్షణ కవచంగా హెల్మెట్‌ను పెట్టుకోవాలంటూ అవగాహన కలిగించారు. రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని, అతి వేగం ప్రమాదకరమని హెచ్చరించారు.

### మినగల్లులో 'నారాయణ' ఉచిత వైద్యశిబిరం

బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లు గ్రామంలో నారాయణ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఈనెల 10న ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి రోగులకు వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులిచ్చారు. సర్పంచ్ బి.పూజిత గ్రామస్తులకు వైద్యసేవల పట్ల అవగాహన కలిగించారు. డాక్టర్లు ప్రశాంత్, ఈశ్వర్, సౌమ్య, నరసింహారెడ్డి, నందకిషోర్ పాల్గొన్నారు.

### కొత్తూరు చింతోపులో 'కిశోరి వికాసం'

ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరు చింతోపు గ్రామంలో ఈనెల 10న ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో 'కిశోరి వికాసం' కార్యక్రమం జరిగింది. ఆడపిల్లలను బాగా చదివించాలని, బాల్యవివాహాలు చేయకూడదని ఆమె గ్రామస్తులకు చెప్పారు. పరిశుభ్రత గురించి కిశోర బాలికలకు తెలియజెప్పారు. ఐసీడీఎస్ పీఓ సమత, సర్పంచ్ విజయ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

### కప్పరాళ్ళతిప్పలో కార్డన్ సెర్చ్

బోగోలు మండలం కప్పరాళ్ళతిప్పలో ఈనెల 10న పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కావలి డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, ఏడుగురు ఎస్ఐలు, 72 మంది పోలీసులతో ఇంటింటా తనిఖీలు చేసి ఎలాంటి పత్రాలు లేని 33 మోటార్‌బైక్‌లు, 3 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు.

### వవ్వేరు కలుజు వద్ద కుంగిన కల్వర్టు

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని కనిగిరి రిజర్వాయర్ మీదుగా వవ్వేరు గ్రామానికి వెళ్ళే దారిలో, వవ్వేరు కలుజుపై ఉన్న కల్వర్టు ఇటీవల కుంగిపోవడంతో, అటుగా రాకపోకలు సాగించే ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. అది కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని, వెంటనే అధికారులు గమనించి దానిని బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

### దగదర్తిలో ఆధార్ కేంద్రం ఏర్పాటు

దగదర్తి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈనెల 10న ఐటీడీఏ ఎస్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటుచేశారు. కొత్తగా ఆధార్ కార్డులు కావాల్సిన వారు, ఆధార్‌లో మార్పుచేర్పులు చేసుకోదలచిన వారు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు కోరారు.

# మన సతీష్‌రెడ్డికి..సమున్నత స్థానం!

## జాతీయ భద్రత సలహామండలి సభ్యునిగా నియామకం



జాతీయ భద్రత సలహామండలి (ఎన్ఎస్ఏబీ) సభ్యునిగా రక్షణ రంగ నిపుణులు.. డీఆర్‌డీఓ మాజీ ఛైర్మెన్.. ప్రముఖ శాస్త్రవేత్త.. మన నెల్లూరీయుడు గుండ్రా సతీష్‌రెడ్డి నియమితులయ్యారు. ఆమేరకు ఈనెల 10న జాతీయ భద్రతా మండలి సచివాలయం ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ భద్రతకు సంబంధించిన విషయాల్లో దీర్ఘకాల వ్యూహాత్మక సలహాలను అందించేందుకు 1998 డిసెంబరులో ఈ మండలి ఏర్పాటు కాగా, ప్రస్తుతం 'రా' మాజీ చీఫ్ అలోక్ జోషి ఛైర్మెన్‌గా ఉన్నారు. ఈ మండలిలో ఆరుగురు సభ్యులున్నారు. వీరిలో మన తెలుగువారైన డి.బాలవెంకటేశ్వర్మ ఒక సభ్యునిగా ఉండగా, తాజాగా సతీష్‌రెడ్డి ఏడవ సభ్యునిగా నియమితులు కావడం ఎంతైనా విశేషం. దేశ భద్రతకు సంబంధించి ఎంతో కీలకమైన జాతీయ భద్రతా సలహా మండలిలో కీలకమైన స్థానాల్లో ఇద్దరు తెలుగువారు ఉండడం తెలుగుజాతికే గర్వకారణం.

నెల్లూరుజిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలోని మహిమలూరు గ్రామం సతీష్‌రెడ్డి స్వస్థలం. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మేటిగా ఉంటూ, ఎంతో ప్రతిష్టాత్మకమైన డిఆర్‌డీఓ ఛైర్మెన్‌గా ఆయన బాధ్యతలు నిర్వహించారు. కేంద్ర రక్షణమంత్రికి సాంకేతిక సలహాదారుగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఏరోస్పేస్, డిఫెన్స్ సలహాదారుగా బాధ్యతాయుతమైన స్థానంలో విధులు నిర్వహిస్తున్నారు. జాతీయ సలహామండలి సభ్యునిగా సతీష్‌రెడ్డి రెండు సంవత్సరాలపాటు కొనసాగనున్నారు. ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని జాతీయ భద్రతా కౌన్సిల్‌కి కూడా వీరు పలు సూచనలను చేసే అవకాశం ఉంటుంది. అంతటి సమున్నతమైన స్థానం సతీష్‌రెడ్డికి లభించడంతో నెల్లూరుజిల్లా ప్రజలు, శాస్త్రసాంకేతిక రంగాల్లో ఉన్నవారు అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా దేశభద్రతకి సంబంధించిన విషయాల్లో కీలకస్థానం పోషించనున్న మన సతీష్‌రెడ్డికి..లాయర్ శుభాకాంక్షలు!

# జనం గుండెల్లో దేవుడు ఎన్టీఆర్

## - ఆస్ట్రేలియాలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో ఇటీవల నిర్వహించిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకల్లో నెల్లూరుజిల్లా నుంచి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా కేకు కట్ చేసి అందరికీ పంచారు. అనంతరం సోమిరెడ్డి ప్రసంగిస్తూ, రాముడు, కృష్ణుడు వంటి దేవతామూర్తులెలా ఉంటారంటే మనకు ఎన్టీఆరే గుర్తుకొస్తారని, పౌరాణిక పాత్రలకు ఆయన జీవం పోశారని అన్నారు. అంతేకాదు, రాజకీయ రంగంలోకి వచ్చి, అప్పట్లో ఏవో కొన్ని కుటుంబాలకే పరిమితమైన రాజకీయాన్ని అన్ని వర్గాలకు పరిచయం చేసిన మహానుభావుడు ఎన్టీఆరేనని కొనియాడారు. ఎన్టీఆర్ కుటుంబానికి సంబంధించి, ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేష్‌బాబు..ఈ మూడుతరాల వారితో రాజకీయాల్లో తాను పనిచేసే అదృష్టం తనకు లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్‌కు ప్రజలంటే ఎంతో అభిమానమని, ప్రజలకు ఎన్టీఆర్ అంటే ఎనలేని అభిమానమని అంటూ, ఇచ్చిన మాట ప్రకారం సంపూర్ణ మద్యపానం నిషేధాన్ని ఎన్టీఆర్ అమలు చేశారన్నారు. ఇప్పుడు విజనరీ లీడర్ చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఐకాన్‌గా నిలుస్తోందన్నారు. వైసీపీ అరాచకాలతో ప్రజలు రోడ్లపైకి వచ్చేందుకు భయపడే పరిస్థితుల్లో లోకేష్ బాబు యువగళం పాదయాత్రతో చైతన్యం నింపారన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర మంత్రిగా ఆ హోదాల్లో అటు రాజకీయంగా, ఇటు ప్రజాపాలనలోనూ లోకేష్ బాబు సత్తా చూపిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ ఆశయాల స్ఫూర్తితో నందమూరి బాలకృష్ణ, దగ్గుబాటి పురంధేశ్వరి తదితరులందరూ ప్రజాసేవలో తరిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ కుటుంబమంటే, ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజల కోసం పనిచేసే కుటుంబమన్నారు. ఈ కార్యక్రమంలో నందమూరి రామకృష్ణ, టీడీ జనార్ధన్, సినీ నటుడు నారా రోహిత్, ఎమ్మెల్యే బోడే ప్రసాద్, టీటీడీ బోర్డు సభ్యులు నన్నూరి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

# మాలకొండ దేవాలయం..డీసీగా చంద్రశేఖర్

నెల్లూరుజిల్లా కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాళెం మాలకొండలో వెలసివున్న సుప్రసిద్ధ నారసింహక్షేత్రం..శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి దేవాలయానికి డిప్యూటి కమిషనర్‌గా, అన్నవరం దేవస్థానం డీసీగా ఉన్న ఎస్.చంద్రశేఖర్ నియమితులయ్యారు. మాలకొండలో ఉన్న కేవీ సాగర్‌బాబును, చిత్తూరుజిల్లా కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి దేవాలయ డిప్యూటి కమిషనర్‌గా నియమించారు. చంద్రశేఖర్ ఈనెల 11న మాలకొండలో డీసీగా బాధ్యతలు చేపట్టారు.

# 'బడి గంట' మోగింది!



- పాఠ్య పుస్తకాలు.. విద్యా సామగ్రి సిద్ధం
- ఈ విద్యా సంవత్సరం నుంచే భారీ సంస్కరణలు

***వేసవి సెలవులు పూర్తయ్యాయి. ఆటపాటలన్నీ కట్టిపెట్టి పిల్లలు స్కూళ్ళకు బయలుదేరారు. 2025-26 విద్యాసంవత్సరం ఆరంభం కావడంతో ఈ నెల 12 నుంచి పాఠశాలలు పున:ప్రారంభమయ్యాయి. విద్యాలయాలన్నీ విద్యార్థుల సందడితో కళకళలాడుతున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 35 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థలో భారీ సంస్కరణలు కూడా అమలులోకి వస్తున్నాయి. గత ప్రభుత్వం విద్యావ్యవస్థను అస్తవ్యస్థం చేయడంతో తిరిగి విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో నైతిక స్థైర్యాన్ని పెంపొందిస్తూ, పలురకాల మార్పుచేర్పులు చేస్తూ ఆశాఖ పట్ల ప్రభుత్వం, ఉన్నత అధికారులు దృష్టిసారించి విద్యావ్యవస్థను చక్కదిద్దుతున్నారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన పాఠశాలల మరమ్మతులు, నిర్మాణాలను కూడా కూటమి ప్రభుత్వం త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసుకుంది. అందుకు మొత్తం సుమారు 7500 కోట్ల రూపాయల వ్యయమవుతుందని అంచనా.***

### చాగంటి సూచనలతో 'విలువల విద్య'

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే 6-10 తరగతుల విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం నుంచి కొత్తగా 'విలువల విద్య' అనే పుస్తకాలను కూడా పంపిణీచేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు సూచనలతో రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఆధ్వర్యంలో ఈ పుస్తకాలను రూపొందించారు. చిన్నతనం నుంచే పిల్లలకు విద్యాబుద్ధులతో పాటు, నైతిక విలువలను, మంచి నడవడికను బోధించేవిధంగా ఈ పుస్తకాలను రూపుదిద్దడం విశేషం.

### అసెస్‌మెంట్ బుక్‌లెట్లు

ఈ ఏడాది నుంచి కొత్తగా విద్యార్థులకు అసెస్‌మెంట్ బుక్‌లెట్లు అందించనున్నారు. వాటిలోనే విద్యార్థులు అన్ని పరీక్షలూ రాయాల్సి ఉంటుంది. ఉపాధ్యాయులు ఆ బుక్‌లెట్లలోనే మార్కులు వేస్తారు. అందువల్ల విద్యార్థుల ప్రగతి ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఉపాధ్యాయులకు, తల్లితండ్రులకు వీలుంటుంది. ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో బుక్‌లెట్ ఇవ్వనున్నారు. ఈ విద్యాసంవత్సరంలో 235 రోజులు బడులు నిర్వహిస్తారు. 83 రోజులు వివిధ రకాల సెలవులుంటాయి. సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 10వ తేదీ వరకు దసరా సెలవులు, జనవరి 10 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు ఇవ్వనున్నారు. జూన్ 25వతేదీ, నవంబరు 25వ తేదీల్లో తల్లితండ్రులు-ఉపాధ్యాయులతో (మెగా పేరెంట్స్-టీచర్స్ డే) పెద్దఎత్తున సమావేశాలు ఏర్పాటు చేసి, విద్యార్థుల విద్యాప్రగతిపై సమీక్షించనున్నారు.

నూతనంగా చేపట్టన విద్యా సంస్కరణల్లో భాగంగా ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వం 9 రకాల బడులు నిర్వహించనుంది. వాటిలో శాటిలైట్ బడులు 438, ఫౌండేషన్ పాఠశాలలు 5065, బేసిక్ ప్రాథమిక పాఠశాలలు 20,025, ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు 8398, ప్రాథమికోన్నత పాఠశాలలు 1303, ఉన్నత పాఠశాలలు 6256 వరకు ఉన్నాయి. ఈ బడుల్లోనే విద్యార్థులకు చదువులు కొనసాగనున్నాయి. కొత్తగా ఈ ఏడాది 8398 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను కూడా ప్రభుత్వం ఏర్పాటుచేయడం విశేషం.

### పుస్తకాలు సిద్ధం :

ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న వారందరికీ పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు సిద్ధమయ్యాయి. జిల్లాలో 2006 ప్రభుత్వ పాఠశాలలు, 921 ప్రైవేట్ పాఠశాలలు, 24 ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. స్కూళ్లు ప్రారంభించిన రోజునే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ 9 రకాల విద్యాసామగ్రితో కూడిన 'విద్యా మిత్ర' కిట్‌లు అందజేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఆమేరకు జిల్లా యంత్రాంగం వాటి పంపిణీపై దృష్టి సారించింది. ఇప్పటికే ఆ కిట్‌లు పాఠశాలలకు చేరుకున్నాయి. వాటిని రెండు విడతలుగా పంపిణీ చేయాలని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. తొలి విడతలో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను అన్ని తరగతుల విద్యార్థులకు అందించాలని ఏర్పాట్లు చేస్తున్నారు. రెండవ విడతలో స్కూల్ బ్యాగు, బెల్ట్, షూస్,సాక్స్, యూనిఫామ్‌లు కూడా అందిస్తారు. ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే'గా ఉంటుంది. ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రినంతా వారి తల్లితండ్రులు సమకూరుస్తున్నారు.

### మార్చి 16 నుంచి టెన్త్ పరీక్షలు :

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రాథమిక తేదీలను కూడా ఈసారి ప్రభుత్వం ముందుగానే ప్రకటించింది. మార్చి 16 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగనున్నాయి. మార్చి 2 నుంచి 12వ తేదీ వరకు పదవ తరగతి విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ ఉంటుంది. ఆమేరకు ప్రభుత్వం షెడ్యూలు రూపొందించింది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com